ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.4	27.2
కావలి	36	27
ఆత్మకూరు	38	27
ఉదయగిరి	38	26
కందుకూరు	36	27



అదిశేషుడిపై విహరిస్తున్న సీతా,లక్ష్మణ సమేత శ్రీరామచంద్రుడు

శేషవాహనంపై అలరించిన శ్రీరాముడు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రం బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి శ్రీరామచంద్రమూర్తి శేషవాహనంపై నగరోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం ధ్వజారోహణం, హోమం, అర్చన, హారతి, తీర్థప్రసాదాల వినియోగం జరిగింది. సాయంత్రం హోమం, బలిహరణ, అనంతరం ప్రదర్శించిన బాలత్రిపురసుందరి నృత్యకేతన్, సాయిలలిత నృత్యనికేతన్ చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కాగా రాత్రికి స్వామివారిని శేషవాహనంపై ఆసీనులను చేసి, మంగళవాయిద్యాలు, విద్యుద్దీపాలంకరణలు, బాణసంచా వేడుకల మధ్య నయనానందకరంగా నగరోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా వీవీ.ప్రసన్నరెడ్డి, స్వర్ణలత వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, రాజు, రామ్‌నగర్ భక్తబృందం పర్యవేక్షించారు.

'పబ్లిక్' వద్దు.. 'ప్రైవేటు' ముద్దు!

- ప్రభుత్వ బ్యాంకులు కాదని ప్రైవేటు బ్యాంకుల వైపు మొగ్గు
- ప్రైవేటు బ్యాంకుల్లో నడుస్తున్న కీలక అకౌంట్లు
- రూ.కోట్ల నిధుల జమ
- వివాదాస్పదంగా కొందరు ఉన్నతాధికారుల నిర్ణయం
- సీఎం ఆదేశించినా, సర్క్యులర్ ఇచ్చినా డోంట్‌కేర్!

రూపాయి, రెండు రూపాయలు కాదు.. రూ.కోట్ల నగదు. అంతా ప్రభుత్వ సొమ్ము. ఇంతటి విలువైన ప్రభుత్వధనాన్ని బాధ్యత కలిగిన ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే దాచిపెట్టాలి. కానీ జిల్లాలో కొన్ని కీలక విభాగాలకు చెందిన ఖాతాలు ప్రభుత్వ బ్యాంకులను కాదని ప్రైవేటు బ్యాంకుల్లోనే కొనసాగుతున్నాయి. ఈ ఖాతాలలో కొన్ని రూ.కోట్ల నిధులు ఉన్నాయి. పదుల సంఖ్యలో ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉంటే వాటిని కాదని ప్రైవేటు బ్యాంకుల్లోనే లావాదేవీలు జరపాల్సిన అవసరం ఏమొచ్చింది? అంటే అధికారులెవరూ సమాధానం ఇవ్వడం లేదు.

నెల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకులు అంటే ఒక నమ్మకం. బ్యాంకింగ్ రంగంలో వీటి పాత్రే ఎక్కువగానే ఉంటుంది. గ్రామస్థాయిలో ప్రజలకు సేవలందించేది కూడా ఈ బ్యాంకులే. రైతులకు రుణాలు ఇవ్వాలన్నా, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సాయం అందించాలన్నా ప్రభుత్వ రంగ బ్యాంకుల లక్ష్యాలే ఎక్కువగా ఉంటాయి. అలాంటిది ప్రభుత్వ శాఖలకు మాత్రం ఈ బ్యాంకులు అక్కరకురావడం లేదు. చాలా శాఖలు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే తమ లావాదేవీలను కొనసాగిస్తున్నా కొన్ని కీలకమైన ఖాతాలు మాత్రం ప్రైవేటు బ్యాంకుల్లో ఉన్నాయి. కలెక్టరేట్‌కు అనుబంధంగా ఉండే భూసేకరణ, పునరావాసం విభాగాలకు చెందిన ఖాతాలు ప్రైవేటు బ్యాంకుల్లో ఉన్నాయి. తెలుగుగంగ ప్రాజెక్టు భూసేకరణ విభాగం ఖాతాలు కూడా ఓ ప్రైవేటు బ్యాంకులో తెరిచారు. చివరకు రామాయపట్నం పోర్టు, దాని అనుబంధ పరిశ్రమలకు జరుగుతున్న భూసేకరణకు సంబంధించిన భూసేకరణ, ఆర్‌అండ్ ఆర్ ఖాతాలను కూడా ప్రైవేటు బ్యాంకు లోనే కొనసాగుతుండటం గమనార్హం. ఒక ప్రాజెక్టుకు భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి లావాదేవీలు రూ.వందల కోట్లలోనే జరుగుతుంటాయి. అంతమొత్తం నిధులను ప్రభుత్వ బ్యాంకుల్లో కాకుండా ప్రైవేటు బ్యాంకుల్లో ఉంచడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



సాధారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నగదు ఉంచితే వడ్డీ వస్తుందని, ప్రైవేటు బ్యాంకుల్లో ఆ పరిస్థితి ఉండడం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇక కొన్ని శాఖలు ఫిక్స్‌డ్ డిపాజిట్లను కూడా ప్రైవేటు బ్యాంకుల్లో ఉంచుతున్నాయి. ఇక్కడ వడ్డీ రేటు తక్కువైనా ఎందుకు అక్కడ డిపాజిట్ చేసున్నారో అర్థం కావడం లేదు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎక్కువ వడ్డీ రేటు ఇస్తామంటున్నా వారి వైపు ఆసక్తి చూపడం లేదని చెప్పుకుంటున్నారు.

సీఎం ఆదేశించినా..!

నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా)కు చెందిన సుమారు రూ.4 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు గతంలో ఓ ప్రైవేటు బ్యాంకులో ఉంచారు. అతి తక్కువ వడ్డీ అయినా అక్కడ ఎందుకు పెట్టారో తెలియదు. రెండేళ్ల క్రితం ఓ ప్రభుత్వ రంగ గ్రామీణ బ్యాంకు నుడా అధికారులను సంప్రదించి ఎక్కువ వడ్డీ ఇస్తామని, ఈ నిధులతో రైతులు, సామాన్యులకు రుణాలు ఇస్తామని చెప్పడంతో ప్రైవేటు బ్యాంకులోని ఫిక్స్‌డ్ డిపాజిట్లను సదరు గ్రామీణ బ్యాంకులోకి మార్చారు. అయితే ఈ మార్పుపై సదరు ప్రైవేటు బ్యాంకు సిబ్బంది తీవ్రస్థాయిలో నుడా అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అంటే ప్రైవేటు బ్యాంకుల ప్రతినిధులు ఏ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రైవేటు బ్యాంకుల నుంచి జిల్లా యంత్రాంగానికి సహకారం కూడా అంతంత మాత్రంగానే ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కాగా పోలవరం ముంపు బాధితులకు ఇచ్చే పరిహారాన్ని ప్రభుత్వం జనవరిలో విడుదల చేయగా ఇప్పటికీ ఆ నిధులు బాధితులకు అందలేదు. ఎందుకిలా అని ఆరా తీస్తే.. సదరు అకౌంట్ ఓ ప్రైవేటు బ్యాంకులో ఉండగా.. ఆ బ్యాంకు నుంచి జమకావడం లేదని తేలింది. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ విధంగా జిల్లాలోనూ అనేక ముఖ్యమైన ఖాతాలు ప్రైవేటు బ్యాంకుల్లో కొనసాగుతున్నాయి. రెండు నెలల క్రితం రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించినప్పుడు ప్రభుత్వ శాఖలకు చెందిన సొమ్మును ఎక్కడా ప్రైవేటు బ్యాంకుల్లో పెట్టవద్దని ఆదేశించారు. ఆ మేరకు సీఎంవో నుంచి ప్రత్యేక సర్క్యులర్ కూడా జారీ అయ్యింది. కానీ ఆ ఆదేశాలను జిల్లాలో పట్టించుకోవడం లేదు. ఇంకా ప్రైవేటు బ్యాంకుల నుంచి ఖాతాలను ప్రభుత్వ బ్యాంకుల్లోకి మార్చడం లేదు.



పెంచలకోనలోని నృసింహుడి ఆలయం

కోన పాలకవర్గం కొలువు దీరేదెన్నడో...?

- వచ్చేనెల 8 నుంచి బ్రహ్మోత్సవాలు
- ఆలయ ఛైర్మన్‌పై దృష్టి సారించని ప్రభుత్వం
- ఎమ్మెల్యేకి కత్తిమీద సాములా ఎంపిక
- పర్యాటక కేంద్రం హామీ నెరవేరేనా..?

రాపూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన ఆలయ పాలకవర్గం కొలువుదీరేదెన్నడోనని భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దాదాపు రెండేళ్లుగా పాలకమండలి లేకపోవడంతో ఆలయ అభివృద్ధి కుంటుపడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన పాలకవర్గం గడువు 2023 సెప్టెంబరు 10కి ముగుసింది. దీంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం పాలకవర్గంపై దృష్టి సారించలేదు. అంతలోనే ఎన్నికల కోడ్‌అమలులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తవుతున్నా, ఇప్పటికీ పాలకవర్గాన్ని నియమించలేదు. ఇకపోతే ఆలయానికి ఇన్‌చార్జిగా కూడా స్థానిక ఎమ్మెల్యే ఎవరిని నియమించలేదు. దీంతో ఆలయ అధికారులు, సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో అతి పెద్ద ఆలయం అయిన పెంచలకోనపై ఎమ్మెల్యే కురుగొండ్ల దృష్టి సారించకపోవడంతో అభివృద్ధి పనులు ఆగాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

8 నుంచి బ్రహ్మోత్సవాలు

మే 8 నుంచి కోనలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల పనులపై ఎమ్మెల్యేకు ఒక మాటైనా చెప్పకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే కురుగొండ్ల నెలకు ఒక్కసారైనా కోనలో పర్యటించి ఆలయం అభివృద్ధిపై సమావేశం ఏర్పాటు చేసి, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

కత్తిమీద సాములా ఛైర్మన్ ఎంపిక

కోన ఆలయ వార్షిక ఆదాయం రూ. 12 కోట్లకు పైగానే ఉంది. అంతేకాక రోజు రోజుకు అభివృద్ధి చెందే ఆలయం కావడంతో పాలకమండలి ఛైర్మన్ పదవిపై అందరి దృష్టి పడింది. టీడీపీని నమ్ముకున్న పలువురు నాయకులు ఛైర్మన్ పదవి కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. అంతేకాక ఈసారి పాలకవర్గంలో డైరెక్టర్ల సంఖ్య పెంపు కారణంగా నోటిఫికేషన్ విడుదలలో ఆలస్యం అయిందని సమాచారం. ట్రస్ట్ బోర్డులో ఎవరిని నియమించాలనేది ఎమ్మెల్యేకి కత్తి మీద సాములా మారింది. మాకంటే..మాకు.. అని కొందరు నాయకులు అంటుండడంతో ఎమ్మెల్యే సైతం డైలామాలో పడ్డారు. గతంలో ప్రతిపక్షనేత హోదాలో చంద్రబాబు కోన ఆలయాన్ని సందర్శించినప్పుడు ఆలయ అభివృద్ధికి నిధులు విడుదల చేసి, పెంచల కోనను పర్యాటక కేంద్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఆయన మాట నిలబెట్టుకుంటారా..? అనేది వేచి చూడాలి. ఈ నేపథ్యంలో ఛైర్మన్ గిరి ఎవరిని వరిస్తుందో చూడాలి.

పెంచిన ధరలు తగ్గించాలి

- దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలోనే గ్యాస్, పెట్రో ధరల పెచ్చు
- నగరంలో సీపీఎం నిరసన ప్రదర్శన



పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలోనే పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు ఎక్కువగా ఉన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీబొమ్మ నుంచి వీఆర్‌సీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి, బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంతో పోల్చుకుంటే కర్ణాటకలో పెట్రోల్ ధరలు రూ. 10 తక్కువగా ఉన్నాయన్నారు. తమిళనాడులో కూడా రూ. 5 తగ్గాయని, కేరళలో మరింతగా తక్కువగా అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. ఇదిలా ఉంటే విద్యుత్ చార్జీలతో అదనపు భారాలు మోపుతున్నారని విమర్శించారు. నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు అల్లాడుతున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌ను అన్ని రాష్ట్రాల కంటే తక్కువ ధరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, పార్టీ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, షాక్ మస్తాన్‌బీ, కొండా ప్రసాద్, నాగేశ్వరరావు, పెంచలనర్సయ్య, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కందుకూరులో కూడా సీపీఎం, అనుబంధ ప్రజాసంఘాల నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

ఎస్పీకి అస్వస్థత

డీహైడ్రేషన్‌తోనే ఇబ్బందులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ జీ. కృష్ణకాంత్ ఆరోగ్యంపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వేసవి తీవ్రతతో ఆయన డీహైడ్రేషన్‌కు లోనై అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గురువారం విధులు నిర్వహిస్తుండగా ఆయన సొమ్మసిల్లారు. గమనించిన కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు నగరంలోని కిమ్స్ వైద్యశాలకు తరలించారు. వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి, డీహైడ్రేషన్‌కు లోనై అస్వస్థతకు గురయ్యారని, ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. ఎస్పీ ఆరోగ్య పరిస్థితిపై హోంమంత్రి వీ. అనిత ఆరాతీశారు. కిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎస్పీని పలువురు పోలీసు అధికారులు పరామర్శించారు.

ప్రభుత్వం దృష్టికి రెవెన్యూ సమస్యలు

కలెక్టర్ ఆనంద్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన జేసీ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న రెవెన్యూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జేసీ కే.కార్తీక్, కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజిత, డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, ఆర్డీవోలతో కలిసి రెవెన్యూ సమస్యలపై కలెక్టర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న రెవెన్యూ సమస్యలపై కూలంకషంగా చర్చించారు. పలు పరిశ్రమలు, విద్యా సంస్థల ఏర్పాటుకు భూముల కేటాయింపు, ప్రైవేటు పట్టా భూములను నిషేధిత 22ఏ నుంచి తొలగించుట, రీ సర్వే సమస్యలు, అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ, వెబ్‌ల్యాండ్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, అసైన్‌మెంట్ భూముల కేటాయింపు, మ్యూటేషన్లు, పీవోటీ, ఇనాం యాక్ట్‌ల వర్తింపు, భూముల రిజిస్ట్రేషన్‌లో తలెత్తుతున్న సమస్యలు, చట్టపరంగా భూసమస్యల పరిష్కారంలో ఎదురవుతున్న అంశాలను తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ అధికారులు సూచించిన ప్రతి సమస్యపై కలెక్టర్, జేసీ సుదీర్ఘంగా చర్చించి పరిష్కారానికి తగిన సూచనలిచ్చారు. చట్టపరంగా, సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సదస్సులో జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డుల ఏడీ నాగశేఖర్, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవోలు అనూష, వంశీకృష్ణ, పావని, తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐలు, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భగవాన్ మహావీర్ జయంతి



భగవాన్ మహావీర్ ఉత్సవమూర్తికి నిర్వహిస్తున్న నగరోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో భగవాన్ మహావీర్ జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. శ్రీజైన్ శ్వేతాంబర్‌మూర్తి పూజక సంఘ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జైన్ మత గురువులు పన్యాస్ సమర్పణప్రభ, మునిరాజ్ ధాన్యప్రభ, దేవోదయప్రభ మార్గదర్శకత్వంలో ఊరేగింపు చేపట్టారు. ఉదయం శ్రేయాన్సాథ్ ఆలయంలో భగవాన్ మహావీర్ విగ్రహానికి శక్రస్తవ అభిషేకం నిర్వహించారు. జియాన్ ఆరాధనభావంలో భగవాన్ మహావీర్ జయంతిని నిర్వహించి, అనంతరం మహావీర్ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఈ ఊరేగింపు మండపాల వీధిలోని జైన ఆలయం నుంచి ప్రారంభమై చిన్నబజారు, పెద్దబజారు, ఆచారివీధి, కాపువీధుల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. ఈ ఊరేగింపులో సుమతి శ్రేయాన్స్ జైన్ ఢోల్ బృందం సంగీత ప్రదర్శన అలరించింది. సంస్కార్ విద్యాలయ పిల్లలు వివిధ వేషధారణలతో మన సంస్కృతిని చాటారు. ఈ కార్యక్రమంలో కిషోర్‌కుమార్ లుంకడ్ స్వరంలో ఆలపించిన గీతాలు అందరినీ ఆకర్షించాయి. సాయంత్రం భగవాన్ మహావీర్ విగ్రహాన్ని సుమతి శ్రావిక గ్రూపు ఆధ్వర్యంలో అద్భుతంగా అలంకరించారు.

కొత్తపేటలో పులి సంచారం ?



పులి పాదముద్రల కోసం అడవిలో గాలింపు చేపడుతున్న అటవీ అధికారులు

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామ సమీపాన గల వాగు ప్రాంతంలో పులి సంచరించడాన్ని ఓ వ్యక్తి గుర్తించాడు. దీంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నరసింహారావు గురువారం వాగు వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ పులి కనిపించడంతో భయంతో గ్రామంలోకి పరుగులు తీశాడు. దీంతో గ్రామస్థులు జిల్లా అటవీశాఖాధికారి మహబూబ్‌బాషాకు సమాచారం అందించారు. ఆయన ఉదయగిరి రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజాను, సిబ్బందిని పంపి పరిశీలించాలని ఆదేశించారు. దీంతో డీఆర్వో మురళి, ఎఫ్‌బీవో ప్రసాద్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని వాగు ప్రాంతంలో పులి పాదముద్రల కోసం గాలింపు చేపట్టగా ఏమీ కనిపించలేదు. గడ్డి బాగా పెరిగి ఉండడంతో పాదముద్రలు కనిపించలేదని, గ్రామస్థుడు చెప్పే ఆనవాళ్ల ప్రకారం అడవిపిల్లిగా అనుమానిస్తున్నట్లు అటవీ అధికారులు పేర్కొన్నారు. గ్రామస్థులు జాగ్రత్తగా ఉండడంతోపాటు ఎప్పటికప్పుడు తమకు సమాచారాన్ని ఇవ్వాలని వారు సూచించారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

అనంతసాగరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ స్థలంలో గురువారం రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేసేందుకు ముగ్గు వేయడంతో తహసీల్దారు సుభాషిణి ఆదేశాలతో బోర్డు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు నరసింహ, మిరామొహిద్దీన్ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8750
వెండి కిలో ధర	రూ. 94,800
వెండి ఒక గ్రాము	రూ.97.80

న్యూస్ బాక్స్

ఫైలేరియా కిట్ల పంపిణీ



ఫైలేరియా కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

ఏఎస్ పేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో గురువారం వైద్యులు సురేష్‌బాబు, మంజుల ఆధ్వర్యంలో ఫైలేరియా వ్యాధిగ్రస్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఖాదర్‌బాషా, ఎంపిహెచ్‌ఈవో చిన్నయ్య, ఎంపిహెచ్‌ఎస్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

దర్గా ఈవోలకు సన్మానం

ఏఎస్ పేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఖాజా నాయబ్ రసూల్ దర్గా ఈవోలు మహమ్మద్ హుసేన్, ఖుదావన్‌లతో పాటు అకౌంటెంట్ ఖాజాలను గురువారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. వక్ఫ్‌బోర్డు సహకారంలో రంజాన్ మాసం ఉపవాసం ఉన్న భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు కల్పించి తగు జాగ్రత్తలు తీసుకున్నారు. వారి సేవలకు కృతజ్ఞతగా గ్రామానికి చెందిన సయ్యద్ రఫీ, జమీల్, ఆబిద్, తదితరులు సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

ఉదయగిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు నిండిన ప్రతిఒక్కరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక దళితవాడ పాఠశాలను సందర్శించారు. వేసవి దృష్ట్యా పాఠశాలల్లో మట్టికుండలు ఏర్పాటుచేసి విద్యార్థులకు చల్లటి నీటిని అందించాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని, రిజిస్టర్లను పరిశీలించారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం : డీఎం

ఆత్మకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తామని ఆత్మకూరు డిపో మేనేజర్ కరీమున్నీసా తెలిపారు. గురువారం ఆమె స్థానిక డిపోలో డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రయాణికుల నుంచి మంచి స్పందన వచ్చింది. పలు సమస్యలతోపాటు, సూచనలు చేశారు. ఆత్మకూరు నుంచి విజయవాడ, విశాఖపట్టణాలకు బస్ సౌకర్యం కావాలని, కొన్ని సమస్యలను దృష్టికి తెచ్చారని, అన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు వాహన సౌకర్యం



వాహనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు

ఉదయగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో వాహనాన్ని ఏర్పాటుచేశారు. గురువారం ఆ వాహనాన్ని సర్పంచ్ లక్కు రమణమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ అనితల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా అబీద్‌బాబా గంధ మహోత్సవం

ఉదయగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కోనకాలువ వద్ద ఉన్న హజరత్ సూఫీ మొహమ్మద్ జైనుల్లాబీదీన్ ఖాదరివుల్ చిస్తీబాబా (అబీద్‌బాబా) గంధమహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పల్లెల్లో బెల్ట్‌షాపుల జోరు

వింజమూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో రాములవారి తిరుణాళ్లు జరుగుతుండడంతో మద్యం బెల్ట్‌షాపుల వ్యాపారం జోరందుకుంది. ముఖ్యంగా గ్రామాల్లో ఈ బెల్ట్ షాపుల వలన ఘర్షణలు జరిగే అవకాశం ఉందని, ప్రతి కూల్‌డ్రింక్ షాపుల్లో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తుండడంపై మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వెంటనే గ్రామాల్లో బెల్ట్ షాపులను నిషేధించాలని, ప్రశాంత వాతావరణంలో తిరుణాళ్లను జరిపించాలని అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

ఉత్సవాల పేరుతో అశ్లీల నృత్యాలు

● పట్టించుకోని అధికారులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలోని పలు మండలాల్లో అశ్లీల నృత్యాలు జోరుగా సాగుతున్నప్పటికీ పట్టించుకునే నాథులే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓవైపు భక్తి గీతాలతోపాటు మరోవైపు రక్తి గీతాలతో హోరెత్తిస్తున్నప్పటికీ నియంత్రించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీజే సౌండ్ సిస్టం, బేబీ డ్యాన్స్‌ల పేరుతో కొంతమంది పొందిన అనుమతులను సాకుగా చెబుతుండగా, మరికొంతమంది ఎలాంటి అనుమతుల్లేకుండా యథేచ్ఛగానే అశ్లీల నృత్యాలు వేయిస్తున్నారు. బేబీల సంగతి ఏమోగాని యువతులు అశ్లీల నృత్యాలు చేస్తూ హోరెత్తిస్తున్నారు. ప్రతినిత్యం ఏదో ఒకప్రాంతంలో బహిరంగంగా సాగుతున్న ఇలాంటి నృత్యాల పుణ్యమా అని పలు గ్రామాల్లో వివాదాలు నెలకొని ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. వరికుంటపాడు మండలకేంద్రంలో సహా కూతవేటు దూరంలోని రామాపురం, కాకొల్లువారిపల్లి, తూర్పురొంపిదొడ్ల గ్రామాల్లో ఇటీవల యథేచ్ఛగా ఇలాంటి డ్యాన్సులు కొనసాగాయి. అలాగే వింజమూరు మండలంలోని గోళ్లవారిపల్లి, బత్తినవారిపల్లి గ్రామాలతో పాటు కొండాపురం మండలం పొట్టిపల్లి, జలదంకి మండలాల్లోనూ యథేచ్ఛగా ఇలాంటి డ్యాన్సులు రోజుకో ప్రాంతంలో సాగుతూనే ఉన్నాయి. ఈనెల చివరి వరకు గ్రామాల్లో ఉత్సవాల పేరుతో డాన్సులు కొనసాగుతూనే ఉంటాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక నిఘా ఉంచి అశ్లీల నృత్యాలను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాహ్మణ వీధిలోని కోదండ రామస్వామి ఆలయంలో గురువారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను ప్రత్యేక వేదికపై ఉంచి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణతంతు నిర్వహించారు. తొలుత ఆలయంలో భక్తులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం వసంతోత్సవం, స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

హనుమంత వాహనంపై సీతారాముల గ్రామోత్సవం



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల స్వామివార్లను హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత ఉభయదాత మామిళ్లపల్లి ప్రసాద్ నివాసం నుంచి నైవేద్యాలను ఆలయానికి చేర్చి పూజల అనంతరం భక్తులకు పంచిపెట్టారు. అనంతరం నిర్వహించిన గ్రామోత్సవంలో భక్తులు కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఆంద్రావారిపల్లిలోనూ కల్యాణం, పారువేట మహోత్సవాలను నిర్వహించారు.

సంగమేశ్వరుడికి పులి వాహనసేవ



సంగం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు సంగమేశ్వరుడి పులి వాహన గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కామాక్షీదేవి సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పులి వాహనంపై ఉంచి సంగం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి రాజుపాలెం గ్రామానికి చెందిన శ్రీరాం కృష్ణారావు, మోహన్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. అదేవిధంగా ఆలయంలోని స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లకు విశేష పూజలు చేశారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపాలి



రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షిస్తున్న తహసీల్దారు సుభద్ర

ఉదయగిరి, ఏప్రిల్ 10(ఆంధ్ర జ్యోతి): ఓటర్ల జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియ జేయాలని తహసీల్దారు సుభద్ర సూచించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఓటర్ల జాబితాపై తహసీల్దారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై, చనిపోయినవారి ఓట్ల తొలగింపులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియ జేయాలన్నారు. ఓటర్ల జాబితా సవరణకు అందరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారులు, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆదుకోవాలని తహసీల్దార్‌కి వినతి

సీతారామపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోస్టాఫీస్ వీధిలో సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి తమ ఇంట్లోని వస్తువులు, దుస్తులు, కాలి బూడిద అయ్యాయని తమను ఆదుకోవాలని బాధితురాలు గుజ్జుల రత్తమ్మ తహసీల్దార్ కృష్ణారెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విచారించి తగిన నష్టపరిహారం మంజూరయ్యేలా చేస్తానని తెలిపారు. కాగా, బాధితురాలు గుజ్జుల రత్తమ్మ కుటుంబానికి మండల జనసేన మహిళ నాయకురాలు భోగినేని సులోచన, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య (గాంధీ)రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

తాగునీటి సరఫరా సజావుగా జరిగేలా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణరావు

ఉదయగిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): లీకేజీలను నివారించి పట్టణంలో తాగునీటి సరఫరా సజావుగా జరిగేలా చర్యలు చేపట్టనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామకృష్ణరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక రైతుసేవా కేంద్రం-1లో పంచాయతీ నీటి సరఫరా సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏడాది క్రితం ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ పథకం పైపులైన్‌ల లీకేజీల నివారణకు స్థానికంగా పరికరాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వాటిని తెప్పించి నివారణ చర్యలు చేపడుతున్నా మన్నారు. అలాగే ఇతర పథకాలకు సంబంధించిన పైపుల లీకేజీలను సైతం నివారించి సజావుగా నీటి సరఫరా జరిగేలా చూస్తామన్నారు. వేసవి దృష్ట్యా ప్రజలు నీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో కరీముల్లా, ఏఈ జగన్నాథం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● తప్పిన ప్రమాదం

కలువాయి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్న సంఘటన గురువారం ఉదయం కలువాయి మండలం దాసరిపల్లె సమీపంలో జరిగింది. పెంచలకోన నుంచి నెల్లూరుకు వెళ్తున్న బస్సు అదుపుతప్పి కల్వర్టును ఢీకొని నిలిచిపోయింది. అయితే బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. బస్సును ఎక్సకవేటర్‌తో బయటకు తీశారు. అనంతరం నెల్లూరు బయలుదేరి వెళ్లిపోయింది.

సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికుల ఆందోళన



ఆత్మకూరు : డిపో ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఆత్మకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఏపీపీటీడీ ఎస్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యూనియన్ నాయకులు గురువారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఎస్ఎంయూఏ కమిటీ జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ 1-19 సర్క్యులర్ యథావిధిగా అమలుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, మెరుగైన ఈహెచ్‌ఎస్ విధానాన్ని అమలు చేయాలని, మెడికల్ లీవ్ కమిటేషన్ ఇచ్చి ప్రతి నెలా జీతం ఇవ్వాలని, మహిళా కండక్టర్లు, గ్యారేజ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంయూఏ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఆ సంఘ నాయకులు స్థానిక డిపో ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికులకు లబ్ధిచేకూరే సర్క్యులర్లను వెంటనే అమలు చేయాలన్నారు. కార్మికులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమాలు రెండు రోజులపాటు అన్ని డిపోల్లో కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు యు శివశంకర్, కార్యదర్శి కాశీవిశ్వనాథ్, నాయకులు రాములు, ఫణికుమార్, సలాం, మునీర్, ఏడుకొండలు, శివ, రసూల్ పాల్గొన్నారు.

పాఠశాలను తరలించొద్దని తల్లిదండ్రుల ఆందోళన



ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పరమటివీధి విద్యార్థుల తల్లిదండ్రులు

సీతారామపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలను తరలించొద్దని స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద జనసేన మహిళా నాయకురాలు భోగినేని సులోచనమ్మ ఆధ్వర్యంలో పరమటివీధి పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా వీధిలోని పాఠశాల 50 సంవత్సరాల నుంచి కొనసాగిస్తున్నారని, ప్రస్తుతం అధికారులు 3,4,5 తరగతుల విద్యార్థులను బెస్తకాలనీలోని పాఠశాలకు పంపమన్నారని, ఇది చాలా దూరంగా ఉందని, ప్రస్తుత పాఠశాలలోనే మా పిల్లలను ఉంచాలంటూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈవో మస్తాన్‌వలికి వినతిపత్రం అందజేశారు.

అత్యధిక సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ టీడీపీ



కార్యకర్తలకు సభ్యత్వ కార్డులు అందజేస్తున్న చెంచలబాబు

ఉదయగిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యధిక సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచల బాబుయాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్సీ కాలనీలో టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు కార్డులు, ట్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సభ్యత్వం తీసు కున్న కార్యకర్తకు రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో 90 వేలకుపైగా సభ్యత్వాలు నమోదవడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన పది నెలల్లోనే రాష్ట్రానికి కోట్లాది రూపాయల పరి శ్రమలు తీసుకువచ్చి లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, శ్రీకుర్తి రవీంద్రబాబు, శివకృష్ణ పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలకు చెత్త తరలించాలి

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని కావలి డీఎల్‌పీవో మాధవిలత సూచించారు. గురువారం మండలంలోని తెడ్డు పాడు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నారా, లేదా అని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇంటింటికెళ్లి రోజూ చెత్త సేకరిస్తే వీధుల్లో చెత్తాచెదారం ఉండదని, దీంతో పల్లెలు పరిశుభ్రంగా ఉండడంతోపాటు ప్రజలు వ్యాధులకు దూరంగా ఉంటారన్నారు. ప్రతి పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున, సర్పంచ్ బోయపాటి వెంకట రత్నం, సర్పంచులు నజీముల్లా, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలి

ఉదయగిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి వారు సేంద్రీయ పద్ధతుల్లో పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి డివిజన్ మాస్టర్ ట్రైనర్ రామ్మోహన్‌రావు అధ్యక్షతన ఓబీలు, సీసీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి 2025 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో రసాయనిక ఎరువులు, పురుగుమందులకు స్వస్తిపలికి సేంద్రీయ పద్ధతుల్లో పంటలు సాగు చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుభద్ర, సీడీపీవో సునీత, ఉద్యాన శాఖాధికారిణి జయశ్రీ, ఏపీఎం ఖాజారంతుల్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల విశిష్టతపై గర్భిణులకు అవగాహన

ఉదయగిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపం నివారణకు చిరుధాన్యాలు ఎంతగానో దోహదపడతాయని ఐసీడీఎస్ సీడీపీవో సునీత పేర్కొన్నారు. గురువారం స్థానిక కోళ్లవీధి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా బాలింతలు, గర్భిణులకు చిరుధాన్యాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పాలు, గుడ్లు, బాలామృతం వంటివి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షాను, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీలాదేవి, అనిత, మహ బూబ్ జానీ, రత్నమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

●ఏఎస్ పేట: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారంపై గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఎంఈవో1కు సత్కారం

అనంతసాగరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సాగరం ఎంఈవో1గా పద్మనాభం గురువారం విధుల్లో చేరారు. ఆయన్ను విద్యాశాఖ కార్యాలయంలో పలువురు ఉపాధ్యాయులు కలసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో 2 ప్రభాకర్‌రెడ్డి, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

కారు డ్రైవర్ దారుణ హత్య

- సినీఫక్కీలో మృతదేహం పూడ్చాలని ప్రయత్నం
- బైక్‌పై తీసుకెళ్లి జనసంచారం ఉండటంతో చెత్తకుప్పలో వేసి పరారీ
- పోలీసుల అదుపులో కొందరు నిందితులు



హత్యకు గురైన వాసు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్‌ను దారుణంగా హత్య చేశారు. సినిమా ఫక్కీలో మృతదేహాన్ని చెరువులో పూడ్చిపెట్టి మాయం చేయాలని ప్రయత్నించినా కుదరకపోవడంతో చెత్తకుప్పలో పడేసి పరారయ్యారు. పోలీసులు, బాధితుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా పామూరు మండలం తిరగలదిన్నెకు చెందిన మాధవ్, జ్యోతి దంపతులు. సుమారు 11ఏళ్ల కిందట ఉపాధి నిమిత్తం నెల్లూరు నగరానికి వలస వచ్చారు. వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ప్రగతినగర్ ఏబ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. వారికి వాసు(23), వాసవిలు సంతానం. వాసు కారు డ్రైవర్‌గా పని చేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. దీంతో పలువురితో గొడవలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఈనెల 9వ తేదీన వాసు పని ఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 7 గంటలకు తండ్రికి ఫోన్ చేసి ఇంటికి ఆలస్యంగా వస్తానని చెప్పాడు. అదేరోజు రాత్రి పొదలకూరు రోడ్డు సారాయం గడి సెంటర్‌లో పాత గొడవల నేపథ్యంలో ఓ యువకుడిపై కత్తితో దాడి చేశాడు. దాడికి గురైన యువకుడు గతంలో వాసు వల్ల ఇబ్బందులకు గురైన వినయ్, మణికంఠ, లోకేష్ అలియాస్ చత్రపతి, తేజ, సంతోష్‌లతోపాటు ఓ రౌడీషీటర్‌కి, మరికొంత మందికి తెలియజేశాడు. అందరూ కలిసి వాసు కోసం గాలించి ఆర్టీసీ బస్టాండు వద్ద వాసును పట్టుకొని ప్రగతినగర్ ఏబ్లాక్ 10వ వీధిలోని దర్గావద్దకు తీసుకువచ్చారు. దర్గా ఎదురుగా ఉన్న రోడ్డుపై అతనిని తీవ్రంగా కొట్టి తమ వద్ద ఉన్న కత్తులతో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశారు. మృతదేహాన్ని బైక్‌పై పెట్టుకుని వెంగళరావునగర్ సమీపంలోని చెరువులో పూడ్చిపెట్టేందుకు యత్నించారు. ఆ సమయంలో అక్కడ జన సంచారం ఉండటంతో ప్రగతినగర్ 10వ వీధి చెరువు సమీపంలోని చెత్తకుప్పల్లో పడేశారు. మృతదేహం ఎవరికీ కన్పించకుండా ఉం డేందుకు పెద్ద చెత్తమూటను పైన వేసి పరారయ్యారు. గురువారం ఉదయం స్థానికులు చెత్త కుప్పలో ఉన్న మృతదేహాన్ని గుర్తించి దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో మృతుడి స్నేహితులు లోకేష్, బదుల్లాలు ఈ విషయాన్ని మృతుడి తల్లి దండ్రులకు తెలియజేశారు. నగర డీఎస్పీ పీ.సింధుప్రియ, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్యలు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు తండ్రి మాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. సాంకేతికత ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి వారిలో కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వివాహిత ఆత్మహత్య

● కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

విడవలూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ముగ్గులో పోసుకునే రసాయన మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి ఊటుకూరు పెద్దపాళెంలో చోటు చేసుకుంది. బాధితురాలు కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోగోలు మండలం తాటిచెట్లపాలెంకు చెందిన సుగుణమ్మ(23)ను ఊటుకూరు పెద్దపాళెంకు చెందిన బుచ్చింగారి హరికృష్ణకు 2021లో పెద్దలు వివాహం చేశారు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఇంతవరకు బాగానే సాగిన కాపురంలో అత్త నరసమ్మ, మామ రెండో నాగూర్, ఆడబిడ్డ నాగ లక్ష్మిలతో పాటు భర్త హరికృష్ణ నుంచి అదనపు కట్నం కోసం వేధింపులు మొదలైయాయి. ఇటీవల ఈ వేధింపులు శృతి మించడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. వారంరోజుల కిందట అత్తింటికి వచ్చింది. అయితే బుధవారం రా త్రి అదనపుకట్నం కోసం భర్తతో పాటు మామ, అత్త, తోడికోడల్లు దారుణంగా అవమానించడంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేష్ కుమార్ యాదవ్ కేసు నమోదు చేశారు.

భార్య ఫిర్యాదుతో భర్తపై కేసు నమోదు

నెల్లూరురూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నాడని భర్తపై భార్య ఇచ్చిన ఫిర్యాదుతో నెల్లూరురూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ గుంజి వేణు కథనం మేరకు.. మండలంలోని గొల్లకందుకూరుకు చెందిన శ్రీధర్, విష్ణువందనలు ఐదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. తాజాగా తన భర్త అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నాడని ఆమె చేసిన ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


వివాహితపై వేధింపులు

● భర్త, అత్తింటివారిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తింటివారిపై వేదాయపాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని వనంతోపునకు చెందిన వేద, శ్రీనివాసులు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వివాహ సమయంలో వేద తల్లిదండ్రులు శ్రీనివాసులు అతని కుటుంబసభ్యులకు రూ.11లక్షలు కట్నకానుకల కింద ఇచ్చారు. రెండేళ్లు సజావుగా వారి కాపురం సాగింది. అనంతరం భర్త, మామ, బావ, చిన్న ఆడపడుచు, ఆమె భర్త అందరూ అదనపు కట్నం కోసం ఆమెను చిత్రహింసలు పెట్టడం ప్రారంభించారు. ఈ మేరకు బాధితురాలు గురువారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ఆత్మకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పాత జంగాలపల్లిరోడ్డులో ఓ వృద్ధురాలి మెడలో ఉన్న 3 సవర్ల బంగారు గొలుసు చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను గురువారం ఆత్మకూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు సీఐ గంగాధర్ నిందితులను విలేకర్ల సమావేశంలో హాజరు పరచి వివరాలు వెల్లడించారు. దేపూరు గ్రామానికి చెందిన టి లక్ష్మమ్మ అనే వృద్ధురాలు గత ఏడాది ఆగస్టు 13వ తేదీన పని నిమిత్తం పాత జంగాలపల్లి వెళ్లి తిరుగు ప్రయాణంలో బస్సు కోసం నిలబడి ఉండగా ఇద్దరు యువకులు మోటారు వాహనంపై వచ్చి మెడలోని బంగారు చైన్ లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈక్రమంలో పఠాన్ రహీం, పఠాన్ రఫీ అనే ఇద్దరు నెల్లూరు పాళెం సెంటర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. ఆమేరకు నిందితుల నుంచి 3 సవర్ల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరితో సంబంధం ఉన్న మరో నిందితుడు శివ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.



విలేకర్ల సమావేశంలో నిందితులను హాజరు పరచిన పోలీసులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212
కోడిగుడ్ల ధర (100): 420	

సమస్యల హైస్కూల్



మరుగుదొడ్లకు తలుపుల స్థానంలో విరిగిపోయిన చెక్కలు

- శిథిలావస్థలో నలదలపూరు పాఠశాల తరగతి గదులు
- విరిగిన తలుపులు.. కిటికీలు
- తలుపులు లేని టాయిలెట్లు
- ఊసే లేని ఆర్వో ప్లాంట్
- పట్టించుకోని అధికారులు

వరేటివారిపాలెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని ప్రభుత్వా లు చేస్తున్న ప్రకటనలు ఆచరణకు నోచుకోవడం లేదు. మండలంలోని నలదలపూరు హైస్కూల్‌లో హైస్కూల్‌లో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకూ 109 మంది విద్యార్థులు ఉన్నారు. సరైన వసతులు లేక విద్యార్థులు సమస్యలతో సతమతం అవుతున్నారు.

● చెదలు పట్టి.. విరిగిపోయిన తలుపులు, కిటికీలు

తరగతి గదుల తులుపులు, కిటికీలు చదులుపట్టి విరిగిపోవడంతో వాటిని తీసి పక్కన పడేశారు. తరగతి గదులకు తలుపులు లేకపోవడంతో ఆకతాయిలు అందులో చేరి అపరిశుభ్రంగా మారుస్తున్నారు. అంతేగాకుండా హైస్కూల్ ఊరికి దూరంగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలు అడ్డగా మారింది. కొన్ని గదులు ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అలాగే మరుగుదొడ్లకు తలుపులు లేవు. ప్రత్యామ్నాయంగా విరిగిన రేకులు, చెక్కలు అడ్డుపెట్టారు. ఈ సమస్యతో మలమూత్ర విసర్జనకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



నలదలపూరు హైస్కూల్‌లో కిటికీలు లేని తరగతి గదులు



తులపులు లేని తరగతి గదులు

● మినరల్ వాటర్ కొనుగోలు

నీటిశుద్ధి జల కేంద్రం లేకపోవడంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్న సమయంలో టీచర్లు క్యాన్ రూ.5పెట్టి మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నారు.

● కూలిన ప్రహరీ

పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీ కొంత భాగం కూలిపో యినా ఇప్పటివరకు దాని నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో హైస్కూల్ ప్రాంగణలోకి మూగ జీవాలు వచ్చి అపరిశుభ్రంగా మారుస్తున్నాయి.

● రహదారి పక్కనే మల, మూత్ర విసర్జన

గ్రామంలో నుండి హైస్కూల్‌కు వెళ్లేందుకు రెండు పర్లాంగులు దూరం ఉంది. హైస్కూల్‌కు వెళ్లే రహదారి మరీ అధ్వానంగా ఉంది. మట్టి రోడ్డు కావడంతో వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము లేస్తుంది. అంతేగాకుండా రహదారికి రెండు వైపులా కొంతమంది గ్రామస్థులు మల,మూత్ర విసర్జన చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు దుర్వాసన భరించలేకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వసతులు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిరుపయోగంగా పాలవెల్లువ కేంద్రం

లింగసముద్రం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారాయి. అనాలోచిత నిర్ణయాలతో గ్రామాలకు దూరంగా నిర్మించిన పలు శాఖలకు చెందిన భవనాలు నేడు ఉపయోగానికి నోచుకోవడం లేదు. గామాల్లో ప్రభుత్వ స్థలాలు ఉన్నా ఆక్రమణలకు గురవడంతో అధికారులు గ్రామాలకు దూరంగా కొన్ని శాఖల భవనాలను నిర్మించారు. అందులో భాగంగా తిమ్మారెడ్డిపాలెం గ్రామానికి అర కిలోమీటరు దూరంలో పాలవెల్లువ కేంద్రం, దానికి సంబంధించిన మరుగుదొడ్డిని లక్షలాది రూపాలయలతో ఐదేళ్ల కిందట నిర్మించారు. కానీ ఈ పాలవెల్లువ కేంద్రాలకు పాలు సేరకించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు ఈ కేంద్రాన్ని అధికారులు ప్రారంభించక పోవడంతో నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం దీని పరిసరాల్లో చిల్లచెట్లు కమ్ముకున్నాయి.



తిమ్మారెడ్డిపాలెంలోని పాలవెల్లువ కేంద్రం

వైభవంగా సీతారాముల కల్యాణం

బిట్రగుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీం పేటలోని రైల్వే లోకో రామ మందిరంలో గురువారం సీఈతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పసుపులేటి చెంచయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రైల్వే కార్మికులతో పాటు రైల్వే విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ చేపట్టారు.

న్యూస్ బాక్స్

గ్రామసభలకు 18 వినతులు

కొండాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఖాతా నెంబర్లు రెగ్యులరైజ్ చేసేందుకు రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న గ్రామసభలకు గురువారం 18వినతులు అందినట్లు తహసీల్దార్ ఎమ్.కోటేశ్వరరావు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జరిగిన గ్రామసభల్లో కొమ్మిలో 6, మర్రిగుంటలో 12 వినతులను రైతులు అందజేశారు. వీటిని పరిశీలించి రెగ్యులరైజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు వీఆర్‌వో మహేష్ పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిత

- ఆర్‌జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ
- విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కావలి రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేయవచ్చని తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్ ప్రియ తెలిపారు. మండలంలోని రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దటంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పాలిసెట్ దరఖాస్తు స్వీకరణకు ఏప్రిల్ 15 చివరితేదీ అని, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యా ర్థులకు రూ.100ఫీజు చెల్లించాలన్నారు. విశ్వోదయ బాలికల పాఠశాల, రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం పాలిసెట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. విశ్వోదయ బాలికల పాఠశాలలో 2025 ప్రవేశ పరీక్షకు అవసరమగు స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం అందజేస్తామని ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్‌ప్రియ తెలిపారు.

త్వరలో గిరిజనులకు ఆధార్ శిబిరం

కావలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డులు లేకుండా ఇబ్బందులు పడుతున్న మండలంలోని గిరిజనుల కోసం త్వరలో ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు తహసీల్దారు శ్రావణ్‌కుమార్ తెలిపారు. గడపగడకు ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 35వ వార్డులో ఇద్దరు గిరిజనులు (యానాదులు) తమకు ఆధార్ కార్డులేదని చెప్పడంతో ఆయన ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



పెదపవని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ నీలాంబరి, తదితరులు

లింగసముద్రం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని ఐసిడిఎస్ పెదపవని సెక్టార్ సూపర్‌వైజర్ నీలాంబరి సూచించారు. గురువారం మండలంలోని పెదపవనిలోని అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ నీలాం బరి, అంగన్వాడీ కార్యకర్తలు పోషణ పక్వాడా కార్యక్రమంపై వారికి అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే ఫౌష్టికాహారంతో పాటు పాలు, గుడ్లు, ఆకుకూరలు సమపాళ్లలో తీసుకోవా లని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు వురు అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయిను లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా

ఉలవపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు, ఉలవపాడు ఐసీడీఎస్ సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం జరిగింది. మొదటి ఆరు నెలలు తల్లిపాలతో శిశువుకి లభించే పోషకాలు గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించినట్లు సూపర్‌వైజర్లు అంజమ్మ, నాగలక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్ వాడీ పోషకాహార లబ్ధిదారులు పాల్గొన్నారు.



పోషణ్ పక్వాడాలో పాల్గొన్న గర్భిణులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● కావలిలో గడప గడపకు ఎమ్మెల్యే కార్యక్రమం

కావలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చి 10నెలలు అవుతున్న సందర్భంగా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే అధికారులతో కలిసి గడపగడపకు ఎమ్మెల్యే కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని వైకుంఠపురం 35వ వార్డులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు వారి వ్యక్తిగత సమస్యలతో పాటు స్థానిక సమస్యలకు ఏకరువు పెట్టారు. ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు రాలేదని కొందరు.. మంచినీరు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, లైట్ల సమస్యను వివరించారు. వెంటనే ఆయాశాఖల అధికారులు సమస్యను నోట్ చేసుకుని అవకాశం ఉన్నంతవరకు వెంటనే పరిష్కారించాలని ఆదేశించారు. ప్రతివార్డుకు రూ.10లక్షలు మంజూరు చేసి చిన్న సమస్యలన్నింటినీ నెలరోజుల్లో పరిష్కరిస్తామన్నారు. వైకుంఠపురంలోని ప్రతి ఇంటికి కొళాయిలతో నీరు అందించేందుకు ఇప్పటికే రూ.23లక్షలు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ డీఈ సాయిరాం, టీడీపీ పట్టణాధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం, అనుబంధ ప్రజాసంఘాల నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, అనుబంధ సంఘాలైన సీఐటీయూ, ఐద్వా ఆధ్వ ర్యంలో గురువారం స్థానిక సుందరయ్య భవన్ నుంచి ఆర్టీసీ డిపో వరకు ప్రదర్శన చేసి అక్కడ నిరసన కార్యక్ర మం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు ఎస్‌ఏ గౌస్, ఎస్కే. మున్వర్ సుల్తానా, ఎస్కే. మల్లిక, ఎం. పద్మ, ఎస్. పవన్‌కుమార్, బీ. శ్రీను, డీఎం రాయుడు, రమణ పేతురు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు రక్తదాన శిబిరం

కావలి,ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): తలసేమియా బాధిత చిన్నారులను ఆదుకునేందుకు లక్ష్మీమెడికల్ కాలేజీఆఫ్ మెడికల్ సైన్సెస్ విద్యార్థులు గురువారం రోటరీక్లబ్‌ఆఫ్ ఆధ్వర్యంలో పాతూరు కళాశాలలో రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరీ, కరస్పాండెంట్ మాధవరెడ్డి మాట్లాడారు. రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న తలసేమియా డే కేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న చిన్నారుల కు వ్యాధితీవ్రతను బట్టి 15లేదా 21రోజులకోసారి ఉచితంగా రక్తం ఎక్కించటంతో పాటు మందులు, పౌష్టికాహారం అందజే స్తామన్నారు. తలసేమియా డేకేర్ సెంటర్ నిర్వహణకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రోటరీక్లబ్‌లు సహకారం అందించారని తెలిపారు. శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు 31 మంది రక్తదానం చేశారు. 43వ సారి రక్తదానం చేసిన మాధవరెడ్డిని రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ హరినారపరెడ్డి, కోశాధికారి మధుసూధనరావు, రోటరీక్లబ్ కావలి కార్యదర్శి మొగల్ సలీంబేగ్‌లు అభినందించారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కేఎస్ఆర్ ఫౌండేషన్ ఔదార్యం

అల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా పట్టణంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు కేఎస్ఆర్ ఫౌండేషన్ ముందు కొచ్చింది. మూడురోజులుగా ప్రతి రోజూ పలు ప్రాంతాలకు ట్యాంకర్‌తో నీటిని సరపరా చేస్తూ ప్రజల దాహార్తిని తీర్చుతున్నారు. ఈ క్రమంలో గురువారం ఆర్‌డీఆర్ కాలనీ, క్రిస్టియన్‌పేట, ఇస్కపల్లి రోడ్డు ప్రాంతాల ప్రజలకు తాగునీటిని సరఫరా చేశారు. నగర పంచాయతీ అధికారులు చేతులెత్తేయడంతో దిక్కుతోచని ప్రజలకు కెఎస్ఆర్ ఫౌండేషన్ సంస్థ ప్రజలను ఆదుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు.



కేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

ఉపాధి హామీ పనుల్లో రూ.1,53,386 అవినీతి

● సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారుల వెల్లడి

ఉలవపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.1,53,386 అవినీతి జరిగిందని గురువారం జరిగిన మండల బహిరంగ సామాజిక తనిఖీ ప్రజావేదికలో డ్వామా పీడీ గంగాభవాని వెల్లడించారు. పెద్దపట్టపుపాలెం గ్రామంలో ఉపాధి పనుల్లో రూ.35,512, చాకిచర్లలో రూ. 38,918, కరేడులో రూ.21,917, ఉలవపాడులో రూ.17,206, ఆత్మకూరులో రూ. 11,351, భీమవరంలో రూ.9,150 అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు తేల్చారు. ఆయాగ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏల నుంచి ఈ మొత్తం సొమ్మును జమ చేయించాల్సిందిగా డ్వామా పీడీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఒక్కరు కూడా ప్రజావేదిక కార్యక్రమానికి హాజరు కాకపోవడం విశేషం. కాగా, ఉలవపాడు, చాకిచర్ల గ్రామాల్లో ఉపాధి పనుల్లో మస్టర్లు వేశారు కానీ కూలీల నుంచి సంతకాలు, వేలిముద్రలు సేకరించలేదు. దీంతో ఎంపీడీవో విజయ, ఏపీడీ బాబురావులను ఆయా గ్రామాల్లో కూలీలతో గ్రామసభ నిర్వహించి విచారించి తగిన నివేదిక 15 రోజుల్లో సమర్పించాలని డ్వామా పీడీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మీ, ఎస్ఆర్పీ బుజ్జి, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఏ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ టీఏలను ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

బీజేపీ నియోజకవర్గ క్రియాశీల సభ్యుల సమావేశం

కావలి టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నియోజకవర్గ క్రియాశీలసభ్యుల సమావేశం గురువారం క్లాత్ మర్చంట్స్ కల్యాణ మండపంలో నిర్వహించారు. పార్టీ ఒకటో పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు మాజీ జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా 10ఏళ్లుగా ప్రజారంజక పాలన అందిస్తుందన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్, సంకల్ప భారత్ వైపు అడుగులు వేస్తూ రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సీనియర్ నాయకులు సీవీసీ సత్యం వేదికపై ఆశీనులు కాకుండా వేదిక ముందు కూర్చోవడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బెల్లంకొండ మాల్యాద్రి, మారెళ్ళ బ్రహ్మారెడ్డి, బ్రహ్మానందం, కమల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భరత్‌కుమార్

ఉపాధి హామీ పనుల పరిశీలన

కలిగిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిర్రావారి పాలెం, వీరనకొల్లు, నాగసముద్రంలో గురువారం ఎంపీడీఓ ప్రత్యూష మహాత్మాగాంధి జాతీయ ఉపాధిహామీ పనులను పరిశీలించారు. పనులు చేస్తున్న మహిళా కూలీలతో మాట్లాడారు. పనుల్లో రోజువారి కూలీ ఎంత వస్తుందో అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా పనుల వద్ద మంచినీరు, మజ్జిగ సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా అని ఏపీఓను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మినీగోకులం షెడ్లను పరిశీలించి ఉపాధి హామీపథకం కింద నాటిన మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.



మహిళాకూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

పేదలు, యాచకులకు నీళ్ల సీసాలు, మజ్జిగ పంపిణీ

కందుకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాచకులు, నిరుపేదలకు శ్రీరా మ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వాటర్‌బాటిల్స్, మజ్జిగ పంపిణీచేశారు. కార్యక్రమంలో మురారిశెట్టి వెంక టసుబ్బారావు, రవ్వా శ్రీనివాసులు, కొత్తూరి వెంకటసుధాకర రావు, గుర్రంచిన అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరుపేద చిన్నారులకు నీళ్లసీసాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఉపాధి పనుల విచారణలో వెలుగు చూసిన అక్రమాలు

● రాష్ట్ర అధికారులకు నివేదిక అందజేత

లింగసముద్రం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ.11.50 కోట్ల ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి గత నెల 18 నుంచి 31వ తేదీ వరకు సామాజిక తనిఖీ అధికారుల విచారణలో పలు అక్రమాలు వెలుగు చూశాయి. మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో మండలంలో మొత్తం 7,824 జాబ్‌కార్డు ఉన్నాయని, వీటిలో 5,909 జాబ్‌కార్డు దారులను కలిసి వివరాలు సేకరించారు. కానీ 1,915 మంది జాబ్‌కార్డుదారులు విచారణలో అందుబాటులో లేకుండా పోయారని వెల్లడించారు. అయితే తాము చేసిన విచారణలో రూ. 91.46 లక్షలు అక్రమాలు వెలుగు చూశాయని నిగ్గుతేల్చినప్పటికీ, డ్వామా అధికారులు సిబ్బందిపై కేవలం రూ.1,18,450 రికవరీకి ఆదేశించడంపై వారు విస్మయం వ్యక్తం చేశారు. అయితే ఈ విచారణ నివేదికను, ప్రజావేది కలో తేల్చిన అంశాలను మంగళగిరిలోని రాష్ట్ర సామాజిక తనిఖీ ప్రధాన కార్యాల యం ఉన్నతాధికారికి తగిన చర్యల కోసం అందజేస్తామని ఎస్ఆర్‌పి బుజ్జి తెలిపారు.

అంకితభావంతో పనిచేయండి

● రైల్వే ఏడీఆర్‌ఎం కొండా శ్రీనివాసరావు.

బిట్రగుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో అంకితభావంతో పని చేయాలని విజయవాడ రైల్వే డివిజనల్ సహాయక మేనేజర్ కొండా శ్రీనివాసరావు రైల్వే కార్మికులకు సూచించారు. గురువారం ఆయన ప్రత్యేక రైల్లో బిట్రగుంటకు చేరుకుని బిట్రగుంట రైల్వేస్టేషన్, కార్యాలయల తనిఖీ చేశారు. అనంతరం డ్రైవర్లు, గార్డులతో సమావేశమై ఉద్యోగ పరమైన సమస్యలపై చర్చించారు. అనంతరం డ్రైవర్లు, గార్డుల విశ్రాంతి భవనాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంకట డివిజనల్ సీనియర్ అధికారులు, స్థానిక క్రూ కంట్రోల్ అధికారి, ఐవోడబ్ల్యూ రాజేష్ ఎస్ఎస్ మురళీధర్ సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఎన్ఎంయూ ధర్నా

కావలి టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ ఉద్యోగులు కావలి డిపో వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి రఘునందన రెడ్డి మాట్లాడారు. ఉద్యోగుల అనేక డిమాండ్లపై ఎన్ఎంయూ రాష్ట్ర నాయకులు ఆర్టీసీ ఎండీని కలిసి వినతిపత్రం అందజేసినా సమస్యల పరిష్కారం కాలేదన్నారు. ఈ విషయంపై రాష్ట్రవ్యాప్తంగా గురు, శుక్రవారాలు డిపోల వద్ద గేట్ మీటింగ్‌లు ఏర్పాటు చేయాలన్న పిలుపుతో ఆందోళనలు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ జిల్లా నాయకులు మీరామొహిద్దీన్, గ్యారేజ్ కార్యదర్శి కలామ్, యూనియన్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



కావలి ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాలనీవాసులు, విద్యార్థులు

డిప్యూటీ సీఎం సార్... రోడ్డు వేయించండి!

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సార్.. మా ఊరికి రోడ్డు వేయించండి... అంటూ కలువాయి మండలం రాజుపాళెం గిరిజన కాలనీ వాసులు గురువారం రోడ్డెక్కారు. జనసేన పార్టీ జెండాలు, ప్లకార్డులు చేత పట్టుకుని ఊరికి రోడ్డు వేయించాలని ర్యాలీ నిర్వహించారు. గతంలో రోడ్డు దుస్థితిపై నివేదికతో పాటు రూ.55లక్షలతో సిమెంటురోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నతాధికారులు పంపారు. కానీ ఇంకా రోడ్డు పనులు మంజూరు కాకపోవడంతో మరోసారి డిప్యూటీ సీఎం స్పందించాలంటూ విజ్ఞప్తి చేస్తూ రోడ్డెక్కారు.

- కలువాయి (ఆంధ్రజ్యోతి)

ఇంటర్‌లో సంస్కరణలపై అవగాహన పెంచాలి

- ఆర్‌ఐవో శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్‌లో నూతన విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెడుతున్న వివిధ రకాల సంస్కరణలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆర్‌ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు అన్నారు. నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరం సబ్జెక్ట్‌లలో కొత్త సిలబస్ ప్రవేశపెట్టారని, ద్వితీయ సంవత్సరం సిలబస్‌ను వచ్చే విద్యా సంవత్సరం నుంచి మార్చనున్నారన్నారు. ప్రథమ, ద్వితీయ భాషలతో పాటు ప్రస్తుతం ఉన్న 4 సబ్జెక్ట్‌లు సైన్స్, 5 సబ్జెక్ట్‌ల ఆర్ట్స్ విభాగాల వ్యవస్థను ప్రక్షాళన చేసి నూతనంగా ఎంబైపీసీ కాంబినేషన్‌ను ప్రవేశపెట్టారన్నారు. ఇంటర్‌లో ప్రవేశపెట్టిన నూతన సంస్కరణలకు అనుగుణంగా కళాశాలలు, తరగతులు నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ విద్యావిధానం, జాతీయ పాఠ్య ప్రణాళికా చట్టాలను అనుసంధానం చేస్తూ ప్రజా స్పందనలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అభ్యసనా సామర్థ్యాలను పెంచడంతో పాటు జాతీయస్థాయి ప్రమాణాలతో ఇంటర్ విద్యను బలోపేతం చేసేందుకే ఈ సంస్కరణలు రూపొందించారన్నారు. దీనిపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం నూతన విద్యాసంవత్సరంలో అడ్మిషన్ షెడ్యూల్, అకడమిక్ క్యాలెండర్, ప్రథమ సంవత్సరం సబ్జెక్ట్‌ల సిలబస్ మార్పు, కొత్త సబ్జెక్ట్‌ల కాంబినేషన్లు, మార్కుల పంపిణీ, ప్రశ్నాపత్రాల డిజైన్ మార్పు, పని గంటల పెంపు వంటి అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీవీఈవో మధుబాబు, సమగ్రశిక్ష ఏఎంవో సుధీర్‌బాబు, రీసోర్స్ పర్సన్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఐవో శ్రీనివాసులు

నేడు మహాత్మా జ్యోతిబా పూలే జయంతి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శుక్రవారం జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి వెంకటలక్ష్మమ్మ ఒక ప్ర కటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నగరంలోని మినీ బైపాస్ రోడ్డులో ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తామన్నారు. 10.30 గంటకు కలెక్టరేట్ తిక్కన భవనంలో జరిగే జయంతి వేడుకల్లో కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు, బీసీ కుల సంఘ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

డీటీసీ డీఎస్పీ బదిలీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ గురువారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న పలువురు డీఎస్పీలకు పోస్టింగ్‌లు కేటాయించడంతో పాటు పలు ప్రాంతాల్లో విధులు నిర్వహి స్తున్న వారిని బదిలీ చేశారు. అందులో భా గంగా నెల్లూరు డీటీసీ డీఎస్పీ ఎం గిరి ధరరావును ఏసీబీకి బదిలీ చేశారు.

14న టీ-20 అండర్-23 క్రికెట్ జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 10(ఆంధ్ర జ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని జిల్లా క్రికెట్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 14వ తేదీన టీ-20 అండర్-23 క్రికెట్ జట్ల ఎంపి కలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డీ.నిఖిలేశ్వర్‌రెడ్డి ఒక ప్రక టనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకా రులు వైట్ డ్రస్ కోడ్‌తో, తమ సొంత క్రికెట్ కిట్‌లు, ఆధార్ కార్డులతో హాజరు కావాలని పేర్కొన్నారు.

రేపు ఆశా వర్కర్ల సదస్సు

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 10(ఆంధ్ర జ్యోతి) : సీపీఎం జిల్లా కార్యాలయంలో ఈనెల 12వ తేదీన ఆశా వర్కర్ల సదస్సు జరుగుతుందని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ఆశాలకు అనుబంధంగా ఉన్న నేషనల్ హెల్త్ మిషన్ ఏర్పడి 20 ఏళ్ల అవుతున్న సందర్భంగా ఈ సదస్సు జరుగు తుందని తెలిపారు. ఇందులో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి పాల్గొంటారని పేర్కొ న్నారు. ఈ సదస్సుకు ఆశా వర్కర్లు తరలి రావాలని తెలిపారు.

అరవై దాటితే అగచాట్లే...!

- పార్కిన్‌సన్స్ వ్యాధితో పొంచి ఉన్న ప్రమాదం
- జిల్లాలో 100 మందికిపైగా బాధితులు
- వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే..
- నేడు ప్రపంచ వణుకుడు వ్యాధి నివారణ దినం

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 10 (ఆంధ్ర జ్యోతి): ప్రతి మనిషి అరవైఏళ్లు దాటాక ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. డోపమైన్ అనే న్యూరోట్రాన్సిటర్ కణం మెదడుకంతా సంకేతాలను ప్రసరింప చేస్తుంది. సాధారణ పరిస్థితిలో మృదువైన సమతుల్యత కండరాలు సమన్వయాన్ని డోపమైన్ కణంతో సాధించవచ్చు. అయితే ఈ కండరం పనితీరు తగ్గటం వల్ల పార్కిన్‌సన్స్ (వణుకుడు) వ్యాధి వస్తుంది. దీంతో చేతులు, కాళ్లు, దవడలు వంటి భాగాల్లో వణుకు వస్తుంది. చూపుడు వేలు, బొటన వేలులో కూడా వచ్చే అవకాశం ఉంది. కొన్ని జన్యు కారణాల వల్ల, పర్యావరణ పరిస్థితుల వల్ల, ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లాలో ఐదు లక్షల మంది వరకు వృద్ధులు ఉండగా, వీరిలో 100 మందికి పైగా ఈ వ్యాధి బాధితులు తెలుస్తోంది. వీరిలో తీవ్రత ఎక్కువగా ఉన్న వారు 20 మంది ఉన్నట్లు వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు. ఏప్రిల్ 11న (నేడు) ప్రపంచ పార్కిన్‌సన్స్ నివారణ దినోత్సవం జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయిం చింది. అందుకు అనుగు ణంగా జిల్లాలో ఈ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు పలు ఆసుపత్రుల్లో నిర్వహిం చనున్నారు.

- చికిత్సలో ఆధునిక విధానాలు

పార్కిన్‌సన్స్ వ్యాధి నివారణకు ప్రస్తుతం ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధిని పూర్తిగా నయం చేయలేక పోయినా తాత్కాలిక ఉపశమనం కలిగించవచ్చు. సిటీస్కాన్, ఎమ్మారై వంటి స్కానింగ్‌ల వల్ల మెదడు పరిస్థితిని తెలుసు కోవచ్చు. డొపమైన్ లోపాన్ని నివారించేందుకు వివిధ రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వారికి చిన్నపాటి డీ బ్రెయిన్ స్టిమ్యూలేషన్ వంటి శస్త్రచికిత్స కూడా చేస్తారు.ఈ శస్త్రచికిత్స కూడా వ్యాధిని కొంత వరకు కంట్రోల్ చేయగలదని నిరూపణ అయింది. అంతేకాక లివోడోపా అనే మందు కనుక్కోబడి మంచి ఫలితాలు ఇస్తుంది. ఐదేళ్ల నుంచి ఏడేళ్ల వరకు ఈ మందు వాడకం వల్ల వ్యాధి తగ్గుముఖం పడుతుంది.

- వ్యాధికి గురికాకుండా...

ఈ వ్యాధికి గురికాకుండా ఉండాలంటే మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండాలి. వాకింగ్, స్విమ్మింగ్ వంటి వ్యాయామాలు చేయాలి. అనవసరమైన ఆలోచనలు మానుకోవాలి. తగినంత నిద్ర పోవాలి. బ్రెయిన్‌కు ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. అలాగే యోగా, ధ్యానం వంటిని చేయాలి. వాహనాలు నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించటం ఎంతో మంచిది. దీంతోపాటు వంటల్లో వాడే నూనెను పదేపదే వాడరాదని వైద్యులు చెబుతున్నారు. పసుపులో యాంటి సెప్టిక్, కర్కుమిన్ అనే పోషకాలు ఎక్కువగా ఉంటాయి దీన్ని దృష్టిలో ఉంచుకుని వంటల్లో పసుపును విరివిగా వాడాల్సి ఉంటుంది.





వ్యాధి లక్షణాలు

- ముందుగా ఏదో ఒక చేతిలో వణుకుడు ప్రారంభమవుతుంది. అనంతరం రెండో చేతికి వస్తుంది.
- ఒక చోట నిలబడలేరు. నడక వేగం తగ్గుతుంది.
- చిన్న వస్తువు కాళ్లకు తగిలినా పడిపోతారు.
- కనురెప్పలు ఆడడం తగ్గుతుంది.
- శరీరంలో కండరాల కదలికలు తగ్గిపోతాయి.
- కండరాలు బిగుసుకు పోవటం, వాసన కోల్పోవటం
- శరీరం చెమట పట్టకపోవడం, నిద్రలేమి సమస్య
- యూరిన్ కంట్రోల్ చేసుకోలేకపోవడం, దుస్తులు తడుపుకోవడం.
- మతిమరుపు వస్తాయి.

నేడు ఎన్నో రకాల వైద్య చికిత్సలు

పార్కిన్‌సన్స్ వ్యాధి నివారణకు నేడు ఎన్నో రకాల ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా వ్యాధిని నియంత్రించ వచ్చు. అయితే వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే డీ బ్రెయిన్ స్టిమ్యూ లేషన్ వంటి శస్త్రచికిత్స ద్వారా వ్యాధిని నియంత్రిం చవచ్చు. వ్యాధి నియంత్రణకు దీర్ఘకాలం పాటు మందులు వాడాల్సి ఉంటుంది. అసలు వ్యాధి రాకుండా ముందస్తుగా మంచి పౌష్టికాహారం తీసుకోవాలి. నిత్యం వ్యాయామం చేయాలన్న మరచిపోకూడదు.

- డాక్టర్ ఫణికుమార్, జీజీహెచ్ న్యూరో ఫిజిషియన్

గురుకులాల్లో నాణ్యమైన విద్య

- ఈనెల 13న ప్రవేశపరీక్ష
- ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐ సొసైటీ జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో విద్యార్థినులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐ సొసైటీ జిల్లా కో-ఆర్డినేటర్ టీ పద్మజ పేర్కొన్నారు.ఈ గురుకులాల్లో ప్రవేశానికి ఈనెల 13న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నామని ఆమె వివరించారు.



? : గురుకులాల్లో విద్యా విధానం ఎలా.

! : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందుబాటులో ఉంది.

? : జిల్లాలో ఎన్ని గురుకులాలు ఉన్నాయి.

! : జిల్లాలో ముత్తుకూరు, రాపూరు, టీపీగూడూరు, సంగం, బుచ్చి, చేజర్ల, బోగోలు, పెద్దపావనిలో గురుకులాలు ఉన్నాయి.

? : ప్రవేశ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారు

! : గురుకులాల్లో ప్రవేశాలకు ఈనెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఐదు నుంచి సీనియర్ ఇంటర్ వరకు విద్య ఉంది. ఐదో తరగతిలో ప్రవేశానికి ఈనెల 13న ఉదయం 10 నుంచి 12గంటల వరకు, ఇంటర్‌లో ప్రవేశానికి అదేరోజు మధ్యాహ్నం 2నుంచి 4.30గంటల వరకు పరీక్ష ఉంటుంది. వచ్చే మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.

? : గురుకులాల్లో ఎంతమంది చదువుతున్నారు.

! : జిల్లాలోని గురుకులాల్లో మొత్తం 4761 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను 642 మంది రాశారు. జూనియర్ ఇంటర్‌లో 427 మంది, సీనియర్ ఇంటర్‌లో 472 మంది పరీక్షలు రాశారు.

? : ఉపాధ్యాయులు, అధ్యాపకుల కొరత ఉందా.

! : ఎక్కడా కొరత లేదు. విద్యార్థినుల సంఖ్యకు తగ్గట్లు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు.

? : మెనూ సరిగా ఉంటుందా.

! : ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మెనూ సక్రమంగా అమలు జరుగుతుంది. విద్యార్థినులకు సక్రమమైన ఆహారాన్ని అందించి, ఆరోగ్యంగా చదువుకునేలా అన్ని చర్యలు చేపట్టాం.

నివేశన స్థలాల ఆక్రమణపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు కలువాయి వాసుల వినతి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వ ఇచ్చిన నివేశన స్థలాలను ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకుని తమ స్థలాలు తమకు ఇప్పించాలని జిల్లాలోని కలువాయి మండలం కలువాయికి చెందిన 18 మంది బాధితులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ఆనంద్‌ను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు ఢిల్లీ రమాదేవి, సత్తు విజయమ్మ, పాముూరు అనూషలు మాట్లాడుతూ 2019లో కలువాయిలోని 930-1 సర్వే నెంబరులో ఒక్కొక్కరికి 2.5 సెంట్లు (15 అంకణాలు) చొప్పున 18 మందికి నివేశన స్థలాలు మంజూరు చేశారని, అందుకు సంబంధించిన పట్టాలను అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అందజేశారని చెప్పారు. ఆ స్థలాలను కలువాయికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకుని మమ్మల్ని అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. బోగస్ సంతకాలతో తప్పుడు డాక్యుమెంట్ సృష్టించడం అతనికి అలవాటేనని ఆరోపించారు. అధికారులను బెదించడం, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడడం, ఫోర్జరీ సంతకాలతో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడం, ప్రశ్నించిన వారిపై అక్రమంగా అట్రాసిటీ కేసులు పెట్టడం ఇతనికి పరిపాటిగా మారిందని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి, నిరుపేదలమైన తమకు న్యాయం చేయాలని కోరారు.



కలెక్టర్ ఆనంద్‌కి వినతిపత్రం సమర్పిస్తున్న కలువాయి వాసులు



మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

జగన్‌కు బెయిల్ రద్దు చేయండి

- అల్లర్లు సృష్టించేందుకే పోలీసులపై అనుచిత వాఖ్యలు
- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు అనుచిత వాఖ్యలు చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బయట తిరగకుండా వెంటనే బెయిల్‌ను రద్దు చెయ్యాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 16 నెలలు జైలులో ఉండి 11 ఏళ్లుగా బెయిల్‌పై తిరుగుతూ రాజకీయ లబ్ధికోసం ప్రశాంతంగా ఉన్న రాయలసీమలో ఫ్యాక్షన్‌కు తెరతీస్తున్నారని విమర్శించారు. చావును అడ్డం పెట్టుకుని జగన్మోహన్‌రెడ్డి రాప్తాడులో బలప్రదర్శన చేశాడని మండిపడ్డారు. పోలీసులను బట్టలూడదీసి కొడతానంటూ అనుచిత వాఖ్యలు చేసిన జగన్‌పై కేసు నమోదు చెయ్యాలని డిమాండ్ చేశారు. తన బెదిరింపుల ద్వారా సాక్షులను బెదిరించినట్లే ఉందన్నారు. హెలికాప్టర్ వింగ్ షీల్డ్ విరిగిపోయిం దనేది పెద్ద డ్రామాలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, పిట్టి సత్యనాగేశ్వర రావు, కువ్వారపు బాలాజీ, అంచూరు శ్రీనివాసులనాయుడు, షేక్ జహీర్, ప్రశాంతకుమార్, నాని, మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో జాప్యం చేయొద్దు

- విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు(జడ్పీ), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లకు జాప్యం లేకుండా వెంటనే మరమ్మతులు చేసి పంపాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో గురువారం ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జిల్లాలోని కావలి, ఆత్మకూరు, నెల్లూరులో విద్యుత్ సంస్థకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ కేంద్రాలు వేసవి కాలం దృష్ట్యా 3 షిఫ్ట్‌లుగా పని చేస్తున్నాయన్నారు. వేసవి కాలంలో ఎక్కువగా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతుంటాయని, వెంటనే మరమ్మతులు చేసి పంపాలని సూచించారు. ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటికి, రైతులకు తొలిప్రాధాన్యం ఇస్తున్నామ న్నారు. జిల్లాలో ఎక్కడైనా తాగునీటి పథకాలకు, రైతులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే వెంటనే యుద్ధప్రాతిపదికన మార్చాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్ ఖర్చు సంస్థకు పెనుభారంగా ఉందన్నారు. ఓవర్ లోడ్ కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యుత్ సిబ్బందిపై ఉందన్నారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌ఫార్మర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షేక్ అల్తాఫ్ పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాల అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

21న ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 11 ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం ఈనెల 21వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈనెల 20న పరీక్ష నిర్వహించాల్సి ఉండగా ఈస్టర్ పర్వదినం సందర్భంగా 21వ తేదీకి పరీక్ష మార్పు చేశారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ మార్పును గమనించి సంబంధిత తేదీలో ఉదయం 10 గంటలకు ఆయా పాఠశాలల్లో జరిగే పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. విద్యార్థుల హాల్‌టికెట్లు www.cse.ap.gov.in లేదా www.apms.apcfss.in వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

నేడు ఏఎంసీ పాలక మండలి ప్రమాణస్వీకారం

వెంకటాచలం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం సర్వేపల్లి ఏఎంసీ (అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ) పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు హాజరుకానున్నారు. దీంతో సర్వే పల్లి ఏఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన టీడీపీ మనుబోలు మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డితో పాటు పాలక మండ లిసభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఈదురు గాలులతో చిరుజల్లులు

కలిగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. దీంతో వాతావరణం చల్లబడింది. ప్రజలు ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందారు.

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలుతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల సమయంలో లింగసముద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఒక్కసారిగా ఈదురు గాలులు వీచాయి.ఈ గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు ఊగిపోయాయి. రోడ్లపై వెళుతున్న ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.కొన్ని చోట్ల చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో సరఫరా నిలిచిపోయింది. లింగసముద్రం, మొగిలిచెర్ల, పెంట్రాల గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో సుమారు అరగంట పాటు ఓ మోస్తరు వర్షం కురిసింది.



కలిగిరిలో పడుతున్న చిరుజల్లులు

సోమశిలలో 52.501 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి 52.501 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కండలేరు నీటి మట్టం 47.25 టీఎంసీలు

రాపూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉన్న కండలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 47.25 టీఎంసీలు ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో 1420 క్యూసెక్కులుగా ఉందని ఆయన తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 1340 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 30 క్యూసెక్కులు చొప్పున మొత్తం 1420 క్యూసెక్కులు నీరు అవుట్‌ఫ్లో అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

డిగ్రీ పరీక్షకు 478 మంది గైర్హాజరు

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో గురువారం జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షకు 478 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి ఆర్.మధుమతి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 7,255 మంది విద్యార్థులకు 6,777మంది హాజరయ్యారు.

సమస్యలు పరిష్కరించాలి

● నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

రాపూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఏపిపిటిడి ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు భాస్కర్‌రావు కోరారు. గురువారం స్థానిక ఆర్‌టిసి డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌లో ఎన్‌ఎంయు.ఎ నాయకులు నిసార్ అహ్మద్, గ్యారెజ్ ప్రెసిడెంట్ హరిబాబు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8750
వెండి కిలో ధర	రూ. 94,800
వెండి ఒక గ్రాము	రూ.97.80

నీటిపారుదల కాలువల ఆక్రమణ

● ధాన్యం గోదాముగా యంత్రకాయమిట్ట కాలువ
● బండరాళ్లతో కాలువ పూడ్చివేత
● గాదెలదిన్నెలో వైసీపీ నేత దౌర్జన్యం, పట్టించుకోని అధికారులు



కాలువను పూడ్చని స్థలంలో వేసిన ధాన్యం బస్తాలు

విడవలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):పంట పొలాలకు సాగునీరందించే కాలువలు మండలంలో కాలక్రమేణ కనుమరుగు అవుతున్నాయి. ఇటీవల చౌకిచర్లలో నీటిపారుదల కాలువను ఆక్రమించుకున్న ఓ వ్యక్తి ఏకంగా దుకాణ ఏర్పాటుకు గదులను నిర్మించాడు. తాజాగా గాదెలదిన్నెలో సుమారు 150ఎకరాలకు సాగునీరు అందించే యంత్రకాయమిట్ట కాలువ వైసీపీ నేతకు ధాన్యం నిల్వ చేసుకోనే గోదాంగా మారింది. కాలువను పూడ్చి వేశారని స్థానిక టీడీపీ నాయకులు, రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారు ఆక్రమణదారుని వద్ద ముడుపులు తీసుకుని నిమ్మకునిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

● కాలువ ఆక్రమించి ధాన్యం బస్తాల నిల్వ

గాదెలదిన్నె పంచాయతీలోని యంత్రకాయమిట్ట కాలువ కింద 150ఎకరాల పొలాలున్నాయి. ప్రతిఏటా రెండు పంటలు ఈ కాలువ కింద రైతులు పండించుకుంటారు. అయితే ఈ కాలువపై కన్నేసిన ఓ ప్రజాప్రతినిధి తన బంధువులకు చెందిన పొలాల్లో ధాన్యంను నిల్వ చే సేందుకు ఎక్కడా స్థలం లేనట్టుగా యంత్రకాయ మిట్ట కాలువను పూడ్చి నాపరాల్లు వేసి దానిపై ధాన్యం బస్తాలను పిరమిడ్ ఆకారంలో నిల్వ చేశాడు. ఇలా చేస్తే మాకు సాగునీరు పారడం ఏలా అని ప్రశ్నిస్తే దైర్జాన్యానికి పాల్పడుతు న్నాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గుంతలను వేసి అం దులో చేపలను సాగు చేస్తున్న ప్రజాప్రతినిధి తాజాగా నీటిపారుదల కాలువని ఆక్రమించుకోవటం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా జిల్లాధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యేకు మొరపెట్టుకుంటాం

కాలువను ఆక్రమించుకున్నారని అధికారులకు తెలుపుకుంటే వారు పట్టించుకోలేదు. దీనివల్ల రెండో పంటను సాగుచేస్తే సాగునీటి ఇబ్బందులు పడాల్సివస్తుంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం.

- తంగేళ్ల శంబయ్య, రైతు

చర్యలు తీసుకుంటాం

యంత్రకాయ మిట్టకాలువ మీద ధాన్యం బస్తాలు వేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. కలాసుని పంపి అక్కడి పరిస్థితి సమీక్షించి విచారణ చేయమని తెలిపాం. ఈ మేరకు విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఆక్రమణలను తప్ప కుండా తొలగిస్తాం. ఆక్రమణలు ఎంతవరకు సహించం.

- సురేష్, ఇరిగేషన్ ఏఈ

వెంకటాచలంలో దొంగల బీభత్సం

● పోలీసుల తీరుపై పెదవి విరుస్తున్న ప్రజలు
● ఈ ఏడాదిలో 10కిపైగా ఇళ్లల్లో చోరీలు
● గస్తీ వదిలేసి.. రహదారిపై మామూళ్ల కోసం..



పగులకొట్టిన హుండీ



చోరీ జరిగిన శ్రీకృష్ణుడి ఆలయం

వెంకటాచలం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. పంచాయతీ పరిధిలోని సత్రంబావికి అనుకొని ఉన్న శ్రీ కృష్ణుడి ఆలయంతో పాటు మరో రెండు ఇళ్లల్లో దొంగతనం చేశారు. శ్రీకృష్ణుడి ఆలయానికి ఉన్న తాళాన్ని పగులకొట్టి లోపలికి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం లోపల హుండీలో ఉన్న రూ.35వేలు, రెండు సవర్ల బంగారు తాళిబొట్టును తీసుకెళ్లారు. చోరీకి గురైన బంగారు తాళిబొట్టుతో పాటు నగదుతో కలిపి రూ.2లక్షల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అలాగే సమీపంలోని రెండు ఇళ్లల్లో కూడా చోరీకి పాల్పడ్డారు. మరికొన్ని ఇళ్లల్లో చోరీ చేసేందుకు యత్నించగా కుక్కలు మొరగడంతో దొంగలు వెళ్లిపోయారు. దీంతో గురువారం ఉదయం చోరీ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసు లకు సమాచారం ఇచ్చారు. సీఐ సుబ్బారావు, ఎస్ఐ అంజనేయులు చోరీ జరిగిన తీరును పరిశీలించి క్లూస్ టీంతో వేలిముద్రలు సేకరించారు. అయితే దొంగతనం జరిగిన ప్రాంతం నుంచి వెంకటాచలం పోలీస్‌స్టేషన్ కేవలం 500మీటర్ల వరకు మాత్రమే ఉంటుంది. కనీసం వెంకటాచలంలోని అన్ని వీధుల్లో పోలీసులు రాత్రి వేళలో గస్తీ చేపట్టరనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తుంది. ఈ ఏడాదిలో 10కిపైగా ఇళ్లల్లో చోరీలు జరిగాయి. పోలీసుల నిర్లక్ష్యంతోనే చోరీలు జరుగుతున్నాయని, పోలీసుల తీరుపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. కానీ కొందరు పోలీస్ సిబ్బంది మాత్రం గ్రామాల్లో గస్తీ చేయకుండా జాతీయ రహదారిపై పోలీస్ వాహనాన్ని నిలిపి మరీ మాముళ్లకు పాల్పడుతున్నా రన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కోనలో భక్తిశ్రద్ధలతో వసంతోత్సవం



విశేష పూజలో పాల్గొన్న ప్రధాన అర్చకులు, ఆలయ ఈవో.

రాపూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలో వసంతోత్సవంలో భాగంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం శేష వాహన సేవ ఆలయ ప్రధాన అర్చకులు వేద పండితుల మంత్రోచ్చారణలతో అత్యంత వైభవముగా నిర్వహించినట్లు ఆలయ ఈవో పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

● గ్రామోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనం

బుచ్చిరెడ్డిపాళెం(ఆంధ్రజ్యోతి): పెద్దూరులో కొలువై ఉన్న సీతా సమేత కోదండరామస్వామి గురువారం గరుడసేవలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం స్వామివారు మోహినీ అలంకరణలో గ్రామోత్సవం చేపట్టారు. రాత్రి ఆలయంలో హరిహరాత్మజం నృత్య నాటక ప్రదర్శన, బుచ్చి మధు ఈవెంట్స్, ఆర్కెస్ట్రా వారితో క్లాసిక్, జానపదం, వెస్టర్న్ డ్యాన్స్ భక్తులను అలరించింది. కోదండరాముడి తిరునాళ్లలో భాగంగా శుక్రవారం స్వామివారు గజవాహన సేవ నిర్వహించనున్నారు.

ఉపాధ్యాయులకు పారితోషికం చెల్లించాలి:ఏపీటీఎఫ్

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి వెంటనే పారితోషికాలు చెల్లించాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి కోరారు. గురువారం మంగళగిరిలోని విద్యా భవన్‌లో ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రూ.35 కోట్లు త్వరలో విడుదల చేస్తామని వారికి ఆయన హామీ ఇచ్చారు.

ఎన్ఈపీ అమలుకు స్టేట్ టాస్క్‌ఫోర్స్

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలో జాతీయ విద్యా విధానం అమలుకు పాఠశాల విద్యాశాఖ స్టేట్ టాస్క్‌ఫోర్స్‌ను నియమించింది. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ చైర్మన్‌గా ఉన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఆ శాఖ కమిషనర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలో ఎన్ఈపీ అమలు ఎంతవరకు వచ్చింది? మొత్తం విధానం అమలుచేసేందుకు ఇంకా చేపట్టాల్సిన చర్యలపై ఈ కమిటీ కసరత్తు చేస్తుంది.

ఉపాధి హామీ పనుల్లో రూ.1,53,386 అవినీతి

● సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారుల వెల్లడి



ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

ఉలవపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.1,53,386 అవినీతి జరిగిందని గురువారం జరిగిన మండల బహిరంగ సామాజిక తనిఖీ ప్రజావేదికలో డ్వామా పీడీ గంగాభవాని వెల్లడించారు. పెద్దపట్టపుపాలెం గ్రామంలో ఉపాధి పనుల్లో రూ.35,512, చాకి చర్లలో రూ. 38,918, కరేడులో రూ.21,917, ఉలవపాడులో రూ.17,206, ఆత్మకూరులో రూ. 11,351, భీమవరంలో రూ.9,150 అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు తేల్చారు. ఆయాగ్రామాల ఫిల్డ్ అసిస్టెంట్లు, టీఏల నుంచి ఈ మొత్తం సొమ్మును జమ చేయించాల్సిందిగా డ్వామా పీడీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఒక్కరు కూడా ప్రజావేదిక కార్యక్రమానికి హాజరు కాకపోవడం విశేషం. కాగా, ఉలవపాడు, చాకిచర్ల గ్రామాల్లో ఉపాధి పనుల్లో మస్టర్లు వేశారు కానీ కూలీల నుంచి సంతకాలు, వేలిముద్రలు సేకరించలేదు. దీంతో ఎంపీడీవో విజయ, ఏపీడీ బాబురావులను ఆయా గ్రామాల్లో కూలీలతో గ్రామసభ నిర్వహించి విచారించి తగిన నివేదిక 15 రోజుల్లో సమర్పించాలని డ్వామా పీడీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మీ, ఎస్ఆర్పీ బుజ్జి, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఏ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

దారి తప్పుతున్న రేషన్ బియ్యం

● అక్రమంగా తరలిస్తున్న మిల్లర్లు
● రేషన్ అక్రమాలకు అడ్డాగా కొడవలూరు
● రూ.12లకు కొని రూ.40లకు అమ్మకం

కొడవలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలం.. రేషన్ అక్రమాలకు అడ్డాగా మారింది. గతంలో రేషన్ బియ్యంను డీలర్లు పక్కదారి పట్టిస్తుంటే ఇప్పుడు కొత్తగా మిల్లర్లు మార్గాన్ని ఎంచుకుని అక్రమ దోపిడీకి పాల్పడుతున్నా అధికారులు మౌనం వహిస్తున్నారు. మండలంలో చాలామంది లబ్ధిదారులు రేషన్ బియ్యం తినడంలే దు. ఇది ఆసరాగా తీసుకున్న అక్రమార్కులు పల్లెల్లో గ్రామానికి మనుషులను పంపి వారి వద్ద కిలో రూ.12లకు కొనుగోలు చేసి ఈ రైస్‌ను మండలంలో మిల్లర్లులో డం ప్ చేస్తున్నారు. అనంతరం వీటిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

● కుదువ పెట్టినున్న రేషన్‌కార్డులు

రెక్కాడితే కానీ డొక్కాడని దళితులు, గిరిజనులను వారి కాలనీల్లో డబ్బు ఆశచూ పి రేషన్‌కార్డు రూ.2వేల నుంచి రూ.వెయ్యి కుదువ పెట్టుకుని వారి కడుపు కొడుతు న్నారు. రేషన్ ఇచ్చేటపుడు వారితో వేలిముద్రలు వేయించుకుని వారి తీసుకుం టున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలో ఎన్టీఆర్ కాలనీ, మీనంగుంట, తలమంచి, కొత్తవంగళ్లు, రేగడి చెలిక, రాచర్లపాడు, సంజీవ్‌నగర్ తదితర కాలనీల్లో ఈ దందా సాగుతోంది. డబ్బు ఆశ చూపి వారి రేషన్ దోచుకోవడంతో పేదలు ఆకలితో అలమటిస్తున్నారు.

● ఇతర రాష్ట్రాలకు తరలింపు

జిల్లాలోని అన్నిగ్రామాల్లో ఇలా సేకరించిన రేషన్ బియ్యంను రాత్రి సమయంలో పెద్దసంఖ్యలో చిన్న ఆటోలు పెట్టి తరలిస్తున్నారు. రేషన్ తరలిస్తున్న వాహనాలను అడ్డుకోకుండా అధికారులకు రూ.లక్షల్లో మామూళ్లు ఇస్తున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ బుచ్చి అర్బన్ కమిటీ ఏర్పాటు



నూతన సభ్యులతో నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ బుచ్చి అర్బన్ కమిటీని పార్టీ అర్బన్ అధ్యక్షుడు రామిశెట్టి కళ్యాణ్ కుమార్ గురువారం ప్రకటించారు. కమిటీలో ఉపాధ్యక్షుడిగా రామారావు, రామచంద్రయ్య, శిన్నయ్య, నాగేశ్వర రావు,రవీంద్ర, శ్రీనివాసులు ఉన్నారు. ప్రధాన కార్యదర్శు లుగా సురేంద్ర, పెంచల ప్రసాద్‌లు కార్యదర్శులుగా సుధాకర్, చెంచయ్య, సురేష్, షాలినీ రాణి, వెంకట నాగార్జున, కోశాధికారిగా పెంచలయ్య, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రమణమ్మ, బీజేవైఎం అధ్యక్షుడిగా మణికంఠ ఉన్నారు. కార్యక్రమంలో నేతలు సురేంద్రరెడ్డి, ఆంజనేయులు, విజయ్‌కుమార్, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, వినయ్‌నారాయణ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూల్లో విద్యార్థుల కోసం స్కూల్ కార్యక్రమాల కోసం స్టేజీ నిర్మించేందుకు పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయం అని బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి ప్రశంసించారు. గురువారం డీఎల్ఎన్ఆర్ హైస్కూల్లో స్టేజీ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి యువత చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులురెడ్డి, శ్రీనాథ్ రెడ్డి చేతులమీదుగా మంగళప్ప చారిటబుల్ ట్రస్టు ద్వారా మెరిట్ విద్యార్థులకు రూ.5వేలు చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో టీచర్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆధార్ కార్డుల జారీకి ప్రత్యేక శిబిరం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోవూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జనన ధ్రువపత్రాలు లేకపోవడంతో గిరిజన బాలలకు ఆధార్ కార్డులకు నోచకోలేకపోతున్నారని ఈ నెల 5న ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు స్పందించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాలతో మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు గిరిజన బాలల ఆధార్ నమోదుకు ప్రత్యేక కాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి తెలిపారు. 6ఏళ్లలోపు బాలలకు ఆధార్‌కార్డుల నమోదుకు తీసుకోవాల్సిన చర్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు ఇచ్చారు. జనన ధ్రువీకరణ పత్రాలు లేని బాలలకు బయోమెట్రిక్ అప్‌డేషన్‌తో ఆధార్‌కార్డులు అందజేస్తామన్నారు. ఈ ప్రత్యేక నమోదులో అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు, డిజిటల్ సహాయకులు, మహిళా పోలీసులు పాల్గొనాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో 15, 16తేదీల్లో కోవూరు, పాటూరు, 17న పడుగుపాడు పంచాయతీ కార్యాలయంలో పడుగుపాడు, గంగవరం, 18న ఇనమడుగు సచివాలయంలో ఇనమడుగు, చెర్లోపాలెం, లేగుంటపాడు గ్రామ సచివాలయంలో లేగుంటపాడు, వేగూరు, 19న పోతిరెడ్డిపాళెం సచివాలయంలో ఆధార్‌కార్డులు లేని గిరిజన బాలలకు ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

నిత్యావసరాల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఫైలేరియా రోగులకు గురువారం వైద్యుడు ఎస్.మనోజ్, వార్డు కౌన్సిలర్ తాళ్ల వైష్ణవిలు టబ్‌లు, టవళ్లు, మగ్గులు, సబ్బులు పంపిణీ చేశారు. ఫైలేరియా వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం వీటిని సరఫరా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నాగరాజు, సూపర్‌వైజర్ పద్మ, ఆశాలు, ఎఎన్ఎంలు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



గిరిజనులతో మాట్లాడుతున్న జనసేన పార్టీ నేతలు

వెంకటాచలం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలను పరిష్కరించడమే జనసేన లక్ష్యమని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు అన్నారు. మండలంలోని ఈదగాలి పంచాయతీ శ్రీకాంత్‌కాలనీని గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. గిరిజనులకు రేషన్, ఆధార్ కార్డులు లేనివారు, ఇతర సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే తాము ఎమ్మెల్యే సోమిరెడ్డి సహకారంతో వాటిని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గిరిజనుల అభ్యున్నతికి ఎమ్మెల్యే తనవంతుగా కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గుమ్మినేని వాణిభవాని, పినిశెట్టి మహేష్, సందూరి శ్రీహరి, మణి ఉన్నారు.

రెండో పంటకు సాగునీరు అందించాలి

● ఇరిగేషన్ ఎస్ఈని కలసిన రైతు సంఘం నాయకులు

విడవలూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఐఏబీ సమావేశాన్ని త్వరగానిర్వహించి రెండో పంటకు సాగునీరు అందించాలని రైతు సంఘం జిల్లా నాయకులు గోవింద్ రెడ్డి, పొన్నలూరు పురంధర్ రెడ్డి, ఓగు నాగేశ్వర రావులు గురువారం నీటిపారుదలశాఖ ఎస్ఈ దేశ్‌నాయక్‌ను నెల్లూరులోని ఆయన చాంబర్‌లో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతేడాది ఐఏబీ సమావేశం ఆలస్యంగా నిర్వహించడంతో రెండోపంటకు సాగునీరు విడుదలలో జాప్యం జరిగిందన్నారు. అందువల్ల రైతులు ఆలస్యంగా నాట్లు వేశారని కోత సమయంలో వర్షాలుపడి నష్టాల్లో చిక్కుకున్నట్లు తెలిపారు. ఈసారైన ఐఏబీ సమావేశాన్ని ముందుగా నిర్వహిస్తే రైతులకు వర్షాల నుంచి ఇబ్బందులు ఉండవన్నారు. స్పందించిన ఎస్ఈ మాట్లాడారు. ఈనెల 17న ఐఏబీ సమావేశాన్ని నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రెండోవ పంటకు సాగునీటిని అందిస్తామన్నారు.



ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

CRIME NEWS

కారు డ్రైవర్ దారుణ హత్య

● సినీఫక్కీలో మృతదేహం పూడ్చాలని ప్రయత్నం
● బైక్‌పై తీసుకెళ్లి జనసంచారం ఉండటంతో చెత్తకుప్పలో వేసి పరార్
● పోలీసుల అదుపులో కొందరు నిందితులు



హత్యకు గురైన వాసు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్‌ను దారుణంగా హత్య చేశారు. సినిమా ఫక్కీలో మృతదేహన్ని చెరువులో పూడ్చిపెట్టి మాయం చేయాలని ప్రయత్నించినా కుదరకపోవడంతో చెత్తకుప్పలో పడేసి పరారయ్యారు. పోలీసులు, బాధితుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా పామూరు మండలం తిరగలదిన్నెకు చెందిన మాధవ్, జ్యోతి దంపతులు. సుమారు 11ఏళ్ల కిందట ఉపాధి నిమిత్తం నెల్లూరు నగరానికి వలస వచ్చారు. వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ప్రగతినగర్ ఏబ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. వారికి వాసు(23), వాసవిలు సంతానం. వాసు కారు డ్రైవర్‌గా పని చేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. దీంతో పలువురితో గొడవలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఈనెల 9వ తేదీన వాసు పని ఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 7 గంటలకు తండ్రికి ఫోన్ చేసి ఇంటికి ఆలస్యంగా వస్తానని చెప్పాడు. అదేరోజు రాత్రి పొదలకూరు రోడ్డు సారాయం గడి సెంటర్‌లో పాత గొడవల నేపథ్యంలో ఓ యువకుడిపై కత్తితో దాడి చేశాడు. దాడికి గురైన యువకుడు గతంలో వాసు వల్ల ఇబ్బందులకు గురైన వినయ్, మణికంఠ, లోకేష్ అలియాస్ ఛత్రపతి, తేజ, సంతోష్‌లతోపాటు ఓ రౌడీషీటర్‌కి, మరికొంత మందికి తెలియజేశాడు. అందరూ కలిసి వాసు కోసం గాలించి ఆర్టీసీ బస్టాండు వద్ద వాసును పట్టుకొని ప్రగతినగర్ ఏబ్లాక్ 10వ వీధిలోని దర్గావద్దకు తీసుకువచ్చారు. దర్గా ఎదురుగా ఉన్న రోడ్డుపై అతనిని తీవ్రంగా కొట్టి తమ వద్ద ఉన్న కత్తులతో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశారు. మృతదేహన్ని బైక్‌పై పెట్టుకుని వెంగళరావునగర్ సమీపంలోని చెరువులో పూడ్చిపెట్టేందుకు యత్నించారు. ఆ సమయంలో అక్కడ జనసంచారం ఉండటంతో ప్రగతినగర్ 10వ వీధి చెరువు సమీపంలోని చెత్తకుప్పల్లో పడేశారు. మృతదేహం ఎవరికీ కన్పించకుండా ఉం డేందుకు పెద్ద చెత్తమూటను పైన వేసి పరారయ్యారు. గురువారం ఉదయం స్థానికులు చెత్త కుప్పలో ఉన్న మృతదేహన్ని గుర్తించి దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో మృతుడి స్నేహితులు లోకేష్, బదుల్లాలు ఈ విషయాన్ని మృతుడి తల్లి దండ్రులకు తెలియజేశారు. నగర డీఎస్పీ పీ.సింధుప్రియ, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్యలు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. మృతుడు తండ్రి మాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. సాంకేతికత ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి వారిలో కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వివాహిత ఆత్మహత్య

● కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

విడవలూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ముగ్గులో పోసుకునే రసాయన మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి ఊటుకూరు పెద్దపాళెంలో చోటు చేసుకుంది. బాధితురాలు కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోగోలు మండలం తాటిచెట్లపాలెంకు చెందిన సుగుణమ్మ(23)ను ఊటుకూరు పెద్దపాళెంకు చెందిన బుచ్చింగారి హరికృష్ణకు 2021లో పెద్దలు వివాహం చేశారు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఇంతవరకు బాగానే సాగిన కాపురంలో అత్త నరసమ్మ, మామ రెండో నాగూర్, ఆడబిడ్డ నాగ లక్ష్మిలతో పాటు భర్త హరికృష్ణ నుంచి అదనపు కట్నం కోసం వేధింపులు మొదలైయాయి. ఇటీవల ఈ వేధింపులు శృతి మించడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. వారంరోజుల కిందట అత్తింటికి వచ్చింది. అయితే బుధవారం రా త్రి అదనపుకట్నం కోసం భర్తతో పాటు మామ, అత్త, తోడికోడల్లు దారుణంగా అవమానించడంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేష్ కుమార్ యాదవ్ కేసు నమోదు చేశారు.

భార్య ఫిర్యాదుతో భర్తపై కేసు నమోదు

నెల్లూరురూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నాడని భర్తపై భార్య ఇచ్చిన ఫిర్యాదుతో నెల్లూరురూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ గుంజి వేణు కథనం మేరకు.. మండలంలోని గొల్లకందుకూరుకు చెందిన శ్రీధర్, విష్ణువందనలు ఐదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. తాజాగా తన భర్త అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నాడని ఆమె చేసిన ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వివాహితపై వేధింపులు

● భర్త, అత్తింటివారిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తింటివారిపై వేదాయపాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని వనంతోపునకు చెందిన వేద, శ్రీనివాసులు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వివాహ సమయంలో వేద తల్లిదండ్రులు శ్రీనివాసులు అతని కుటుంబసభ్యులకు రూ.11లక్షలు కట్నకానుకల కింద ఇచ్చారు. రెండేళ్లు సజావుగా వారి కాపురం సాగింది. అనంతరం భర్త, మామ, బావ, చిన్న ఆడపడుచు, ఆమె భర్త అందరూ అదనపు కట్నం కోసం ఆమెను చిత్రహింసలు పెట్టడం ప్రారంభించారు. ఈ మేరకు బాధితురాలు గురువారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ఆత్మకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పాత జంగాలపల్లిరోడ్డులో ఓ వృద్ధురాలి మెడలో ఉన్న 3 సవర్ల బంగారు గొలుసు చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను గురువారం ఆత్మకూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు సీఐ గంగాధర్ నిందితులను విలేకర్ల సమావేశంలో హాజరు పరచి వివరాలు వెల్లడించారు. దేపూరు గ్రామానికి చెందిన టి లక్ష్మమ్మ అనే వృద్ధురాలు గత ఏడాది ఆగస్టు 13వ తేదీన పని నిమిత్తం పాత జంగాలపల్లి వెళ్లి తిరుగు ప్రయాణంలో బస్సు కోసం నిలబడి ఉండగా ఇద్దరు యువకులు మోటారు వాహనంపై వచ్చి మెడలోని బంగారు చైన్ లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈక్రమంలో పఠాన్ రహీం, పఠాన్ రఫీ అనే ఇద్దరు నెల్లూరు పాళెం సెంటర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. ఆమేరకు నిందితుల నుంచి 3 సవర్ల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరితో సంబంధం ఉన్న మరో నిందితుడు శివ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.



విలేకర్ల సమావేశంలో నిందితులను హాజరు పరచిన పోలీసులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212

కోడిగుడ్ల ధర (100): 420



పాఠశాలకు విద్యాసామగ్రి అందజేత

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొండాయపాళెం నగర పాలక ప్రాథమిక పాఠశాలకు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, కృష్ణపట్నం హైదరాబాద్ పైప్‌లైన్ ప్రాజెక్ట్ సంస్థలు గురువారం మూడు గ్రీన్ బోర్డులు, ఒక కలర్ ప్రింటర్, మూడు కుర్చీలు, ఆరు ఫ్యాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ ఉమారాణి, సంస్థల సీనియర్ మేనేజర్ ప్రమోద్‌కృష్ణన్, మేనేజర్ నరసింహారావు, అసిస్టెంట్ మేనేజర్ బీమ్లానాయక్, హెచ్ఎం భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు అయ్యప్ప జన్మదిన వేడుకలు

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి పాల్గుని ఉత్తర నక్షత్రం సందర్భంగా శుక్రవారం అయ్యప్ప స్వామి జన్మదినం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం అధ్యక్షుడు జి.శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, విశేష అలంకారం, పూజలు జరుగుతాయని తెలిపారు. అలాగే గురువాయూర్ మహావిష్ణు దేవస్థానంలో మహాలక్ష్మీ జన్మనక్షత్ర పన్గుణి ఉత్తర సందర్భంగా అభిషేకం, అలంకారం పూజలు జరుగుతాయని భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

సాహితీ విజేతల ఎంపిక

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గోవిందరాజుల సీతాదేవి సాహితీ పురస్కారం-2024 పోటీల్లో న్యాయ నిర్ణేతలు విజేతలను ప్రకటించారని ఆ సంస్థ వ్యవస్థాపకురాలు సుభద్రాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌సీ.కృష్ణస్వామి రచించిన నవల మేకల బండ, కెపి.ముని సురేష్ పిళ్లై రచించిన కథాసంపుటి గారడి వాడులు ఎంపికయ్యాయని తెలిపారు. విజేతలకు త్వరలో రూ.5వేలు చొప్పున నగదు పురస్కారం, సత్కారాలు చేస్తామని పేర్కొన్నారు.

13న కవి సమ్మేళనం, సాహిత్య సదస్సు

నెల్లూరు(సాంస్కృతికం) ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చిన్ని నారాయణరావు సాహిత్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న ద్వితీయ అక్షరోత్సవం జరుగుతుందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిన్ని నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం టౌనుహాలు ఏసీ భవన్‌లో ఆదివారం సాయంత్రం 5గంటలకు జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం, సాహిత్య సదస్సులు జరుగుతాయని తెలిపారు. సాహితీ అభిమానులు అందరూ తరలిరావాలని కోరారు.

నేడు పంగునోత్తర కల్యాణం

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి, రంగనాయకమ్మలకు తిరుమంజనం వైభవంగా జరుగుతుందని ఈవో ఏవీ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రంగనాయకమ్మకు పంగునోత్తర ఉత్తర నక్షత్రం జన్మనక్షత్రం సందర్భంగా రాత్రి 7గంటలకు కల్యాణం జరుగుతుందని, భక్తులందరూ తరలిరావాలని పేర్కొన్నారు. గురువారం పంగునోత్తర 3వ ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఉదయం తాయార్లకు తిరుమంజనం జరిగింది. సాయంత్రం స్థల పురాణం పఠనం అనంతరం రంగనాథస్వామికి, రంగనాయకమ్మ (తాయార్లు)కు ప్రాకారోత్సవం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు ఒకే ఫిర్యాదు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నెల్లూరు రెండవ డిపోలో గురువారం జరిగిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఒక ఫిర్యాదు అందింది. నెల్లూరు నగరానికి చెందిన బ్యాంకు ఉద్యోగి ఎస్ సాయియామిని డయల్ యువర్ డీఎంకు ఫోన్ చేసి నెల్లూరు నుంచి కర్నూలుకు ఏసీ బస్సు నడపాలని కోరారు. పరిశీలించి ఉన్నతాధికారులతో మాట్లాడి వారాంతరాల్లో ఏసీ బస్సు నడిపేలా చర్యలు చేపడుతామని డీఎం శివకేశవయాదవ్ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆర్టీసీ నెల్లూరు-1వ డిపో పరిధిలో ప్రయాణికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, సలహాలు తెలిపేందుకు ఈనెల 11వ తేది డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ మురళీకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రజలు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 9959225641 నెంబరుకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

ఆంజనేయుడికి గంధర్వ వాహన సేవ

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సంతపేట ఆంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం 8వ రోజుకి చేరాయి. ఉదయం విశేష పూజలు, అలంకారం జరిగాయి. ఉదయం గిన్నెబిక్ష ఉత్సవం కనుల పండువగా జరిగింది. సాయంత్రం మూలవర్లకు పూలంగిసేవ, విశేష పూజలు జరిగాయి. రాత్రి గంధర్వ వాహనంలో స్వామివారికి పేట ఉత్సవం వైభవంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వేడుకలను ఉభయకర్తలు, ఈవో రఘురామయ్య పర్యవేక్షించారు.

బ్యాంకు ఉద్యోగం ఇప్పిస్తానని..

రూ.9.60 లక్షల దోచేసింది!

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తానని లక్షలు తీసుకొని ఓ మహిళ మోసం చేసిందని మరో మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేదాయపాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని కరెంటు ఆఫీసు సెంటర్‌లో గడుపూడి శ్రీదేవి, సుధాకర్ దంపతులు నివాసం ఉంటున్నారు. శ్రీదేవి గతంలో ఓ ప్రైవేటు గోల్డ్‌లోన్ సంస్థలో ఉద్యోగం చేసేవారు. 2021 నవంబరు నెలలో కలువాయి మండలం చవటపల్లి గ్రామానికి చెందిన బత్తల రజిత అలియాస్ రమ్య గోల్డ్‌లోన్ పొందేందుకు వచ్చి శ్రీదేవికి పరిచయం అయ్యింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ బ్రాంచ్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాని, నేను డబ్బులు చెల్లించి ఉద్యోగంలో చేరానని, మీరు కొంత డబ్బులు చెల్లిస్తే ఉద్యోగం ఇప్పిస్తానని శ్రీదేవిని నమ్మించింది. రమ్య మాటలు నమ్మిన శ్రీదేవి బ్యాంకులో ఉద్యోగం వస్తుందన్న ఆశతో అప్పులు చేసి నవంబరు నెలలో రమ్యకు రూ.లక్ష, పలు దఫాలుగా అమె అకౌంట్‌కు రూ.5 లక్షలు, ఆమె తండ్రి వెంకటేశ్వర్లు అకౌంట్‌కు రూ.3లక్షల ఇలా రూ.9లక్షలు ఇచ్చింది. అక్కడితో ఆగకుండా ఉద్యోగంలో చేరాలంటే ఐడెంటీ కార్డ్, మెడికల్ టెస్ట్‌లు కచ్చితంగా చేయాలని మరో రూ.60 వేలు వేయాలని సూచించడంతో శ్రీదేవి ఆ నగదును వెంకటేశ్వర్లు అకౌంట్‌కు వేసింది. రూ.9.60 లక్షల వేసిన తర్వాత శ్రీదేవికి బ్యాంకు ఉద్యోగంకు సంబంధించిన ఆఫర్ లెటర్, ఐడెంటి కార్డును పంపారు. అయితే రోజులు గడుస్తున్న ఉద్యోగంలో చేరే విషయం గురించి మాటలు మారుస్తూ కొత్త జాయినింగ్ లెటర్లు పంపుతూ ఉండడంతో రమ్య వ్యవహార శైలిపై శ్రీదేవి కుటుంబసభ్యులకు అనుమానం వచ్చింది. దీంతో వారు రమ్యను గట్టిగా ప్రశ్నించడంతో ఉద్యోగాలు ఇప్పించే వ్యక్తి చనిపోయాడని, వాళ్ల వలన మాకు రావలసిన డబ్బులు ఆగిపోయాయని సమాధానం చెప్పింది. దీంతో శ్రీదేవి నాకు ఉద్యోగం వద్దు మా నగదు మాకు తిరిగి ఇవ్వాలని గట్టిగా అడగగా ఇస్తాను అంటూ వాయిదా వేస్తూ వచ్చింది.

ఇప్పటి వరకు రమ్య రూ.70 వేలు మాత్రమే ఇచ్చిందని, నా భర్త వెళ్లి వాళ్ల తల్లిదండ్రులను ఎన్ని సార్లు నగదు గురించి అడిగినా సమయం కావాలని చెబుతున్నారని, మా డబ్బులు ఇవ్వక పోగా మమ్మల్నే బెదిరిస్తున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు ఇచిచన వారు ఇంటికి వచ్చి ఒత్తిడి చేస్తున్నారని, నాకు న్యాయం చేయాలని బాధితురాలు వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉద్యోగం పేరు తో నిరుద్యోగులను మోసం చేసే ఆర్థిక నేరగాళ్ల ను కఠినంగా శిక్షించాలని, ఈ మోసాల వెనుక ఎవరో పెద్ద హస్తం ఉందని అందరిని శిక్షించా లని శ్రీదేవి పోలీసులను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలని యూటీఎఫ్ నేతలు కోరారు. నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ ఆనంద్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలన్న పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నేతలు మాట్లాడుతూ నూతన విద్యావిధానంలో భాగంగా ప్రతి గ్రామానికి మోడల్ ప్రైమరీ స్కూల్‌తో పాటు తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని 39 మండలాల్లోని అన్ని గ్రామాల్లో పదివేల కరపత్రాలను పంపిణీ చేస్తు న్నామన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులను ప్రభుత్వ బడిలే చేర్పించేందకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీవీ.శేషులు, జీవీ.చలపతిశర్మ, అసోసియేట్ అధ్యక్షుడు ఎంసీ.అచ్చయ్య, జిల్లా నేతలు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేయండి

● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో అట్టడుగున ఉన్నవారి సమస్యలను పరిష్కరించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్‌లతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటి వరకు దాదాపు 6,400 వినతులు అందాయన్నారు. ఇందులో 2,582 వినతులు ప్రతి బుధవారం తాము నిర్వహించే ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చినవని వివరించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో నోరులేని గిరిజనులు అనేక మంది ఉన్నారని చెప్పారు. వారిలో అర్హతలు ఉండి కూడా కొందరు పెన్షన్లు, ఇళ్ల వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారని చెప్పారు. వారికి సత్వరమే ఆధార్‌కార్డులు అందించి తద్వారా సంక్షేమ కార్యక్రమాలు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలలో రెవెన్యూకి సంబంధించిన భూ సమస్యలే అధికంగా ఉన్నాయన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ నిర్దిష్ట సమయంలోగా రెవెన్యూ సమస్యల అర్జీలను పరిష్కరించాలని తహసీల్దార్లకు దిశా నిర్దేశం చేశారు. ఇరిగేషన్ స్థలాలను ఆక్రమించుకుని లే అవుట్లు వేసి ఉంటే వాటిని గుర్తించి తదనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో ఉదయభాస్కర్, ఆర్డీవో అనూష, జడ్పీసీఈవో విద్యారమ, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, సమగ్ర శిక్ష ఏపీఓ వెంకటసుబ్బయ్య, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవానీ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఎడిఫై' వార్షికోత్సవం



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రతినిధులు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీనగర్ ఎడిఫై స్కూల్ ద్వితీయ వార్షికోత్సవం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్స్ నరేష్‌రెడ్డి, డాక్టర్ వెంకట్‌రావులు మాట్లాడుతూ అత్యున్నత విద్యా ప్రమాణాలతో విద్యార్థులకు బోధన చేయడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలియచేస్తున్నామన్నారు. అన్ని విభాగాల్లో విద్యార్థులు రాణించేలా వారిని తీర్చి దిద్దుతున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన బాలరామాయణం, లవకుశల వేషధారణ, ఆంజనేయుని పుట్టుక, అతీత శక్తులు, శివతాండవం, ట్రైబుల్ డాన్స్‌లు, పురాణాలను తెలియచేస్తూ చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో అకడమిక్ హెడ్ సునీతవర్మ, అపస్మా అధ్యక్షులు శ్రీదర్, కోశాధికారి అభిషేకరెడ్డి, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు



సుందరేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : నగరంలోని శివాలయాల్లో గురువారం రాత్రి త్రయోదశి సందర్భంగా ప్రదోషకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మూలస్థానేశ్వరాలయం, నీలకంఠేశ్వరాలయం, నవాబుపేట మల్లేశ్వరస్వామి ఆలయం, ఉస్మాన్‌సాహెబ్‌పేట కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో నందీశ్వరునికి అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి ఆలయంలోని శ్రీసుందేశ్వరస్వామి ఆలయంలో త్రయోదశి సందర్భంగా ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. సాయంత్రం నందీశ్వరస్వామి విశేషంగా అభిషేకాలు పంచామృతాభిషేకం, విశేష అలంకార పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉభయకర్తలు, ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.



మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో వెండి నంది సేవ ఉత్సవం

ఓటేయని వారూ పనులు చేయించుకోవచ్చు

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ● టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

నెల్లూరురూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో తనకు ఓటు వెయ్యకుండా, వ్యతిరేకంగా పనిచేసిన వారు కూడా స్వచ్ఛందంగా తనవద్దకు వచ్చి పనులు చేయించుకోవచ్చని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో 31వ డివిజన్ అక్కచెరువుపాడుకు చెందిన వైసీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డిల మిత్రబృందాన్ని కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నమ్ముకుని పార్టీలోకి వచ్చిన వారిని తగిన గౌరవంతో చూసుకుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కార్యకర్తలు బలంగా ఉన్న నియోజకవర్గాల్లో నెల్లూరురూరల్ మొదటి సానంలో ఉందని తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 19 మంది బాధిత కుటుంబాలకు రూ.23 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను అందచేశారు. కాగా 34, 35 డివిజన్లలో జరుగుతున్న సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించి అనుకున్న సమయానికి అభివృద్ధి పనులు ప్రజలకు అందచేయాలని ఆ దిశగా పార్టీ నాయకులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

● గిరిధర్‌రెడ్డికి అస్వస్థత

రూరల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి మధ్యాహ్నం సమయంలో ఇంటికి చేరుకున్నారు. ఎండతీవ్రత నేపథ్యంలో ఆయన అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల బృందం అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఎలాంటి ఆందోళనకర అనారోగ్య సమస్యలు లేవని, ఎండల్లో తిరగడం, విశ్రాంతి లేకుండా పర్యటనలు నిర్వహించడం వల్ల కాస్త అస్వస్థతకు గురయ్యారని తేల్చారు. అనంతరం ఆయన డిశ్చార్జి అయ్యి ఇంటికి వెళ్లిపోయారు. ఈ సమాచారం తెలుసుకున్న పార్టీ శ్రేణులు భారీగా అపోలో ఆసుపత్రికి చేరుకున్నాయి.



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే

చంద్రప్రభపై వేణుగోపాలుడి విహారం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం అభిషేకం, విశేషపూజలు, యాళి వాహనంలో పేట ఉత్సవం జరిగింది. సాయంత్రం విశేష పూజలు, పూలంగిసేవలు జరిగాయి. అనంతరం స్వామివారికి చంద్రప్రభ వాహనంలో నగరోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు, సిబ్బంది పర్యవేక్షించారు.

● శ్రీరామచంద్రుడి ఉత్సవం

నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి చంద్రప్రభ వాహనంలో శ్రీరామచంద్రస్వామికి పేట ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకాలు, పూలంగిసేవ, విశేష పూజలు, సింహ వాహన అలంకారంలో ఉత్సవం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ప్రముఖులు, ఈవో దర్గయ్య, ఉభయకర్తలు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.



చంద్రప్రభపై వేణుగోపాలస్వామి

● సీతారాములుకు తిరుచ్చిసేవ

నగరంలోని త్యాగరాజస్వామి మందిరంలో సీతారాములు బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి తిరుచ్చి సేవ జరిగింది. ఉదయం తిరుమంజన సేవ, సాయంత్రం ఊంజల్ సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థానం కమిటీ ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

● బాలాజీనగర్‌లో...

నగరంలోని బాలాజీనగర్ సీతారామ మందిరంలో బ్రహ్మోత్సవాలు కొనసాగున్నాయి. గురువారం ఉదయం అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. అనంతరం మోహినీ అలంకారం (గిన్నెబిక్ష) ఉత్సవం అలరించాయి. సాయంత్రం పూలంగిసేవ, విశేష పూజలు, స్వామివారికి గరుడసేవ పేట, ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఉత్సవ కమిటీ చైర్మన్ అమరా మోహన్‌రావు, ఆలయ చైర్మన్ తన్నీరు మస్తాన్‌రావు, కార్యదర్శి సోమిరెడ్డి వెంకటరత్నం, కోశాధికారి కొప్పరపు శివప్రసాద్, అర్చకులు బృందం సభ్యులు పర్యవేక్షించారు.

మజ్జిగ, బిస్కెట్ల పంపిణీ



మజ్జిగ అందిస్తున్న శ్రీనివాసులు

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన బాధితులకు కుంచాల విజయభాస్కర్ దాతృత్వంతో మజ్జిగ, బిస్కెట్‌ల చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు ప్రారంభించి మాట్లాడారు. అలాగే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దివ్యాంగులకు బిస్కెట్లు అందచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ ఫౌండేషన్ చైర్మన్ మోపూరు భాస్కర్‌నాయుడు, మెగరాల సురేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆనం కాంస్య విగ్రహం ఏర్పాటు నిర్ణయం హర్షణీయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు ముద్దుబిడ్డ ఆనం వివేకానందరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని తెలుగుదేశం పార్టీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. ఆనం శిష్యులతో కలిసి ఆయన రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శ్రీధర్‌రెడ్డిని గురువారం ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా వినోద్‌రెడ్డి మాట్లాడుతూ ఆనం రాజకీయాలను ఒంటబట్టించుకున్న వ్యక్తి శ్రీధర్‌రెడ్డి అని కొనియాడారు. వచ్చే నెల 31 నాటికి కాంస్య విగ్రహం శంకుస్థాపన చేస్తామని చెప్పడం చాలా సంతోషంగా ఉందని, ఆరు నెలల్లో విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మలేపాటి చైతన్య, మాధవ్‌రెడ్డి, బర్నబాస్, మేఘనాథ్‌సింగ్, నారాయణరెడ్డి, అలహరి విజయ్, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు(హరనాథపురం): నెల్లూరులో దివంగత మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఉదయగిరి నరసింహులు గౌడ్, గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాలకీర్తి రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా నెల్లూరు పట్టణ అభివృద్ధికే కాక, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉదయాన్నే లేచి పురవీధుల్లో తిరిగే వరవడిని ప్రారంభించిన ఘనత ఆనం వివేకానందరెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. ఇదే పద్ధతిని అవలంబిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి జనాల్లో తిరిగే రివాజు ఉందని పేర్కొన్నారు. వివేకానందరెడ్డి విలువలను గ్రహించిన వ్యక్తిగా ఆయన విగ్రహ స్థాపనకు శ్రీధర్‌రెడ్డి కృషి చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. త్వరితగతిన భూమిపూజ చేసి సాధ్యమైనంత త్వరలో విగ్రహం ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలివ్వండి

నెల్లూరురూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కార్పొరేషన్‌లో గడిచిన రెండు నెలలుగా ఆగిన జీతాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ నాయకులు ఏడీసీ నందన్‌కు గురువారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కళ్యాణ్ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ విభాగంలో డ్రైవర్లుగా పని చేస్తున్న వారికి జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో మరెక్కడ లేని పరిస్థితి నెల్లూరులో ఏర్పడిందని చెప్పారు. ప్రతి నెల క్రమం తప్పకుండా జీతాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



ఏడీసీకి వినతిపత్రం అందచేస్తున్న కార్మికులు

అటుకుల మిషన్ వచ్చేసిందోచ్...!



సౌత్‌మోపూరులో ఏర్పాటు చేసిన అటుకుల తయారీ యంత్రం

ఎప్పుడెప్పుడాని ఎదురు చూస్తున్న అటుకల మిషన్ వచ్చేసింది. మండలంలోని సౌత్‌మోపూరులో గురువారం అటుకలు తయారు చేసే యంత్రాన్ని ఏర్పాటు చేశారు. గడిచిన మూడేళ్లగా ఈ యంత్రం గ్రామంలో ఏర్పాటు చేయ్యకపోవడంతో ఆశగా ఎదురు చూస్తున్న గ్రామస్థులకు యంత్రం నిర్వాహకులు ఊరటనిచ్చారు. నెల రోజుల పాటు ఈ యంత్రం గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కేజీ వడ్లను అటుకులుగా తయారు చేసినందుకు రూ.10లు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. కొన్నేళ్లగా ప్రతి ఏటా ఇక్కడ యంత్రాన్ని ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు మూడేళ్ల విరామం తరువాత మళ్లీ ఏర్పాటు చేశారు.

- నెల్లూరురూరల్,(ఆంధ్రజ్యోతి)



సంపద కేంద్రంలో వర్మీకంపోస్టు తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, డీపీవో సుశీలాదేవి

ఒకప్పట్లో ఊర్లో చెత్తను శివార్లలో పడేసే వారు. కొండల్లా పేరుకుపోయి దుర్గంధం నెలకొనేది. పర్యావరణ సమస్యతో పాటు స్థానికులూ అనారోగ్యం బారిన పడేవారు. 'స్వచ్ఛ పల్లె' నినాదంతో అలాంటి చెత్త నుంచి సంపద సృష్టించేలా ఏడేళ్ల కిందట సీఎం హోదాలో చంద్రబాబు రూపకల్పన చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వీటిని నిర్లక్ష్యంగా వదిలేయగా.. మళ్లీ చంద్రబాబు ప్రభుత్వంలో లక్ష్యం దిశగా అడుగులేసింది. ఫలితం మూడు నెలల్లో జిల్లాలోని పంచాయతీలకు రూ.13.5 లక్షల ఆదాయం వచ్చింది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

చెత్త నుంచీ సంపద

- పంచాయతీలకు మూడు నెలల్లో రూ.13.5 లక్షల ఆదాయం
- వైసీపీ హయాంలో మూలనపడ్డ షెడ్లు
- కూటమి అధికారంలోకి వచ్చాక పునరుద్ధరణ



సంపద కేంద్రంలోని తొట్టెలో వర్మీకంపోస్టు తయారీ

చెత్త నుంచి సంపద సృష్టించాలి. తద్వారా పంచాయతీలకు ఆదాయంతో పాటు గ్రామాలూ పరిశుభ్రంగా ఉండాలి. ఇలా 'స్వచ్ఛ పల్లె' నినాదంతో 2019కి ముందే పంచాయతీల్లో సంపద కేంద్రాలను సీఎం చంద్రబాబు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇది సాకారం దాల్చే సమయానికి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్లపాటు జగన్ ప్రభుత్వం సంపద కేంద్రాలను నిర్లక్ష్యం చేసింది. స్వచ్ఛ పల్లెలు అనేది మొక్కుబడిగా మారింది. ఊరి చివరన ఉన్న సంపద కేంద్రాలు మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. రూ.వేలల్లో ఖర్చుపెట్టి నిర్మించిన తొట్టెలు శిథిలావస్థకు చేరాయి. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చింది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా చంద్రబాబు ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రభుత్వ ఆదేశాలతో తిరుపతి జిల్లాలో చెత్త సంపదకేంద్రాలపై కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టి సారించారు. జిల్లాలో 774 పంచాయతీలున్నాయి. వీటిలో 610 పంచాయతీల్లో యుద్ధప్రాతిపదికన చెత్త సంపద కేంద్రాలను(ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు) పునరుద్ధరించారు. కలెక్టర్‌తో పాటు డీపీవో సుశీలాదేవి, ఎస్‌డబ్ల్యూపీసీ జిల్లా కో ఆర్డినేటర్ శిరీష ఈ కేంద్రాలను పర్యవేక్షిస్తూ వచ్చారు. గత మూడు నెలలుగా ప్రతి ఇంటి నుంచి తడి.. పొడి చెత్త విడివిడిగా సేకరించడానికి పంచాయతీ సిబ్బందిని ఏర్పాటు చేశారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించారు. తడి చెత్తతో వానపాముల ఎరువుల తయారీ (వర్మీకంపోస్టు), పొడిచెత్తను రీసైక్లింగ్ చేస్తున్నారు. సంపద కేంద్రాలకు చేరే చెత్తను 45 రోజులపాటు తొట్టెల్లో మగ్గపెట్టి తరువాత వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారు. మార్కెట్లో కిలో రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. పచ్చదనంతో అత్యంత సుందరంగా చెత్తసంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వర్మీకంపోస్టు ద్వారా రూ.13.5 లక్షలు

జిల్లాలో శానిటేషన్ వర్కర్లు, క్లాప్ మిత్రలు 2,527మంది పనిచేస్తున్నారు. వర్మీకంపోస్టు తయారీలో వీరంతా భాగస్వాములే. గడిచిన మూడు నెలల్లో వర్మీకంపోస్టు అమ్మకం ద్వారా రూ.13.5 లక్షల ఆదాయం పంచాయతీలకు చేకూరింది. కొన్ని పంచాయతీల వారు జాతీయ రహదారులు, గ్రామ కూడళ్లతో పాటు పంచాయతీ కార్యాలయాలు, కలెక్టరేట్‌లోనూ వర్మీ కంపోస్టు విక్రయిస్తున్నారు.

ఆదాయాన్ని పంచాయతీలకే కేటాయిస్తున్నాం

జిల్లాలో 610 పంచాయతీల్లో చెత్త నిర్వహణ కేంద్రాలను అమల్లోకి తెచ్చాం. త్వరలో మిగిలిన వాటినీ వినియోగంలోకి తెస్తాం. మూడు నెలల్లోనే వర్మీకంపోస్టు విక్రయం ద్వారా రూ.13.5 లక్షలు పంచాయతీలకు ఆదాయం వచ్చింది. ఈ ఆదాయాన్ని నాలుగింతలు రెట్టింపు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నాం. వర్మీకంపోస్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆ పంచాయతీల అభివృద్ధికే కేటాయిస్తాం.

- వెంకటేశ్వర్, కలెక్టర్



రేణిగుంట మండలం తూకివాకం వద్ద హైవేపై వర్మీకంపోస్టు విక్రయం





వడమాలపేటలోని చెత్తసంపద కేంద్రం - తొట్టెలో మగ్గబెట్టిన వ్యర్థాలు

రేషనలైజేషన్ షురూ

సచివాలయాల్లో క్లస్టర్లవారీ విభజన పూర్తి

మిగులు సిబ్బంది 700 నుంచి 800 మంది

తిరుపతి (కలెక్టరేట్)/తిరుపతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సేవలను మరింత చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం హేతుబద్ధీకరణ చేపట్టింది. ఇందులో భాగంగా సచివాలయాలను క్లస్టర్లుగా విభజించే కార్యక్రమం పూర్తయింది. సంబంధిత విధివిధానాలు తయారుచేయాలని సచివాలయ పాలన విభాగానికి, మండలపరిషత్‌లకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేయగా, అధికారులు వారం క్రితం పూర్తిచేశారు. దీంతో జిల్లా యంత్రాంగం క్లస్టర్ల విభజన ప్రారంభించి కసరత్తుచేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

జిల్లాలో సచివాలయాలు: 691
(అర్బన్ 207, రూరల్ 484)
ప్రతిపాదిత క్లస్టర్లు : 352
(అర్బన్ 105, రూరల్ 247)
ఉద్యోగులు: సుమారు 5600 మంది
మిగులు ఉద్యోగులు : 700 - 800 మధ్య

విభాగాలుగా సిబ్బంది

గ్రామ సచివాలయాల్లో 11 మంది, పట్టణాల్లో 9 మంది చొప్పున సిబ్బంది ఉంటారు. ప్రస్తుతం వీరిని పలు విభాగాలుగా విభజించారు.

- బహుళార్థక విభాగంలో నాలుగు కేటగిరీల ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉంటారు. వీరు సర్వేలు చేపడతారు. ఇతర సేవలను క్లస్టర్ స్థాయిలో అందిస్తారు.
- సాంకేతికత విభాగంలో వ్యవసాయ, సెరికల్చర్, ఉద్యాన, ఇంజనీరింగ్, ఆరోగ్య, పశు సంవర్థక, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్ సహాయకులు ఉంటారు.
- ఐటీలో ప్రవేశమున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉద్యోగులను గుర్తించి ఇన్ఫర్మేషన్ విభాగంలో చేర్చుకున్నారు. వీరిని ఐటీ అవసరాలకు వినియోగించనున్నారు.
- రెవెన్యూ విభాగంలో వీఆర్వోలు, సర్వేయర్లు ఉంటారు. మహిళా పోలీసులను ఐసీడీఎస్ విభాగంలో లేదా పోలీసు స్టేషన్లలో నియమించనున్నారు. అయితే పలువురు పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహించడానికి సుముఖత చూపడం లేదు.

ఎంపీడీవోల ఆధ్వర్యంలో...

ప్రతి మండలంలో పక్కపక్కన ఉన్న సచివాలయాలను క్లస్టర్లుగా పరిగణిస్తారు. సచివాలయాలు సరిసంఖ్యలో ఉంటే సగం క్లస్టర్లు ఏర్పాటవుతాయి. ఉదాహరణకు 12 సచివాలయాలుంటే ప్రతి క్లస్టర్‌లో ఆరేసి సచివాలయాలను ఏర్పాటుచేస్తారు. బేసి సంఖ్యలో ఉంటే ఒక క్లస్టర్ పరిధిలోకి రెండు సచివాలయాలను తీసుకొస్తారు. బహుళార్థక విభాగంలో జనాభా ప్రాతిపదికన, సాంకేతిక విభాగంలో క్లస్టరు పరిధిలో ఉద్యోగులను గుర్తిస్తారు. వీరు రెండేసి సచివాలయాల్లో పనిచేయాల్సి ఉంటుంది. క్లస్టర్ల విభజన పనిని ఎంపీడీవోలు పూర్తిచేశారు. 2500 జనాభా ఉన్న చోట ఆరుగురు, 2501 నుంచి 3500 మంది ఉన్న చోట్ల ఎనిమిది మంది, ఆపై జనాభా ఉన్న సచివాలయాల పరిధిలో 10మందిని నియమించేలా నివేదికలు తయారుచేశారు.ఈ లెక్కన ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న సుమారు 5600 మందిలో 700-800 మధ్యలో మిగులు ఉద్యోగులు ఉండొచ్చని అంచనా. వీరిని ఏయే శాఖల్లో నియమించాలన్న దానిపై ఇంకా ప్రభుత్వం నుంచీ స్పష్టత రాలేదు.



గాలివానకు నేలకొరిగిన భారీ వృక్షం

చంద్రగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో పట్టణంలో గురువారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. దీంతో కొత్తపేటలోని రోడ్డు పక్కనున్న భారీ చింత చెట్టు నేలకొరిగింది. ఇది సమీపంలోని విద్యుత్ తీగలపై పడటంతో రెండు స్తంభాలు విరిగిపోయాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఓ హోటల్ ముందు రేకుల షెడ్డు కూలిపోయింది. జాతీయ రహదారిలో తీగలపై ఫ్లెక్సీలు పడటంతో సాయంత్రం 4 నుంచి రాత్రి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



పన్ను వసూళ్లలో తిరుపతి మూడోస్థానం

- కమిషనర్ల సదస్సులో మౌర్యకు సన్మానం

తిరుపతి, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): పన్నుల వసూళ్లలో తిరుపతి నగరపాలక సంస్థ రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం నిలిచినందుకు తిరుపతి కమిషనర్ ఎన్.మౌర్యను ప్రత్యేక కార్యదర్శి సురేష్, సీడీఎంఏ సంపత్‌కుమార్ సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. తిరుపతి నగర పాలక సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.100కోట్ల వివిధ రకాల పన్ను చెల్లింపులు జరిగాయి. ఆస్తిపన్ను రూ80.44కోట్లు, ఖాళీస్థలాల పన్ను (వీఎల్టీ) రూ9.92కోట్లు, నీటి పన్ను రూ8.18కోట్లు, మురుగునీటి పన్ను రూ1.50కోట్లు పన్నుల రూపంలో కార్పొరేషన్ ఖాతాలోకి చేరింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.84కోట్లు మాత్రమే వసూలు కాగా, ఈసారి వంద కోట్ల మార్కు దాటడంతో పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లలో తిరుపతి మూడో స్థానంలో నిలిచింది. ఖాళీ స్థలాల పన్నులు చెల్లించడంలో తొలి నుంచీ కార్పొరేషన్ వెనుకంజలో ఉంది. ఎంత ఒత్తిడి చేసినా రూ4కోట్లు పైన వసూలైన సందర్భాలు లేవు. ఖాళీ స్థలాల యజమానులు స్పందించకపోతే ప్రభుత్వ స్థలమని బోర్డులు పెడతామని.. వీఎల్టీ చెల్లించకుంటే టీడీఆర్ బాండ్లు ఇచ్చేందుకు నిబంధనలు ఒప్పుకోవని కమిషనరు చెప్పడంతో ఈ ఏడాది దాదాపు రూ10కోట్లు వసూలయ్యాయి. టీటీడీ నుంచి రావాల్సిన కొన్ని ఆస్తులకు సంబంధించిన పన్నుల వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈమొత్తాన్ని మినహాయిస్తే రాష్ట్రంలోనే తిరుపతి నగరపాలక సంస్థ పన్ను వసూళ్లలో మొదటి స్థానంలో ఉన్నట్టేనని రెవెన్యూ అధికారి ఒకరు చెప్పారు.



కమిషనర్ మౌర్యను అభినందిస్తున్న మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి సురేష్, సీడీఎంఏ సంపత్‌కుమార్

తిరుపతి డీఎస్పీగా భక్తవత్సలం

- ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ నరసింగప్ప పెనుగొండకు బదిలీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి డీఎస్పీగా భక్తవత్సలం నియమితులయ్యారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న వెంకటనారాయణను ప్రభుత్వం నెల కిందట బదిలీ చేసిన విషయం విదితమే. మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ శ్రీలతను ఇన్‌చార్జిగా నియమించారు. ఆ పోస్టులో ప్రస్తుతం భక్తవత్సలంను ప్రభుత్వం నియమించింది. 1991లో ఎస్ఐగా పోలీసు శాఖలో అడుగుపెట్టిన ఈయన కర్నూలు జిల్లాలో పలుచోట్ల పనిచేశారు. 2005లో సీఐగా పదోన్నతి పొంది కౌంటర్ ఇంటెలిజెన్స్‌లో, డోన్, ములకలచెరువు, మళ్లీ డోన్, కోడుమూరులో పనిచేశారు. 2014 ఎన్నికల్లో సత్యవేడు సీఐగా నియమితులయ్యారు. అక్కడే డీఎస్పీగా పదోన్నతి పొందారు. తర్వాత వివిధ చోట్ల పనిచేసిన ఆయన 2024 ఎన్నికల్లో ప్రొద్దుటూరు డీఎస్పీగా పనిచేశారు. అక్కడి నుంచి కొన్ని రోజులు వీఆర్‌లో ఉంటూ ప్రస్తుతం తిరుపతి డీఎస్పీగా నియమితులయ్యారు. ఇక, తిరుపతి ఎస్సీ, ఎస్టీ సెల్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న నరసింగప్పను అనంతపురం జిల్లా పెనుగొండకు ప్రభుత్వం బదిలీ చేసింది.



విద్యుత్తు తీగలు తగిలి ఎలుగుబంటి మృతి!

భాకరాపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):. విద్యుత్ తీగలు తగిలి ఓ ఎలుగుబంటి మృతి చెందింది. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టిచర్ల పంచాయతీ తుమ్మసేనపల్లి అటవీ సరిహద్దు ప్రాంతంలో పెదనాయన చెరువు సమీపంలో అడవి జంతువుల కోసం పెట్టిన విద్యుత్ తీగలు తగిలి గురువారం మృతి చెందినట్లు సమాచారం. దీనిపై అటవీ అధికారులు తమకు సమాచారం లేదని చెబుతున్నారు. కొన్ని రోజులుగా ఈ ప్రాంతాల్లో అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు పెడుతున్నారు. జంతువులు బలైపోతున్నాయి. ఇటీవల కరెంట్ తీగలు తగిలి ఓ ఏనుగు చనిపోయింది.





ఆస్పత్రిలో నిరీక్షిస్తున్న దివ్యాంగులు

వైద్యుల కోసం దివ్యాంగుల పడిగాపులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అంగ వైకల్యం సర్టిఫికెట్లను పునఃపరిశీలించే ప్రక్రియను ప్రభుత్వం మొదలుపెట్టింది. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని దివ్యాంగులకు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో గురువారం పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10గంటలకే దివ్యాంగులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు వైద్యులు రాకపోవడంతో వీరంతా ఇబ్బంది పడ్డారు. ఎండకు తాళలేక, మధ్యాహ్నం తిండి లేక అలమటించారు. నడవలేని వారు ఆటోల్లోనే నిరీక్షిస్తూ ఉన్నారు.

వసంతోత్సవం

వనంలా సెట్టింగు. అందులో సింహం, పులులు, కోతులు, కుందేళ్లు, ఎలుగుబంటి, జింకల బొమ్మలు. ఇలా శేషాచల అడవిని తలపించేలా తిరుమలలోని వసంత మండపాన్ని తీర్చిదిద్దారు. వసంతోత్సవాల్లో భాగంగా అక్కడి వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి గురువారం స్నపన తిరుమంజనం నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి









టీటీడీకి విరాళంగా వంద సైకిళ్లు

తిరుమల శ్రీవారికి గురువారం వంద సైకిళ్లు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన మురుగప్ప గ్రూప్ టీఐ సైకిల్స్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు వీటిని ఆలయ డిప్యూటీఈవో లోకనాథంకు అందజేశారు. ఈకార్యక్రమంలో పేష్కార్ రామకృష్ణ, ఇన్‌చార్జ్ డీఐ హరిబాబు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారిసేవలో కేంద్రమంత్రి



జ్యుయల్ ఓరం

తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి జ్యుయల్ ఓరం, ఎంపీ కేశినేని చిన్ని(శివనాథ్), నిర్మాత అంబిక కృష్ణ, మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో 'అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి' బృందం

'అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి' చిత్ర హీరో కల్యాణ్‌రామ్, దర్శకుడు ప్రదీప్, నటుడు పృద్వీరాజ్, చిత్ర బృందంతో కలిసి విజయశాంతి గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో ఆమె మాట్లాడుతూ, ఈ సినిమా 18న విడుదల కాబోతోందని, తప్పకుండా రెండు రాష్ట్ర ప్రజలు సినిమాను చూసి పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నానని అన్నారు. తమ సినిమాను అందరు తప్పకుండా చూసి ఆదరించాలని హీరో కల్యాణ్‌రామ్ కోరారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం ముందు విజయశాంతి, కల్యాణ్‌రామ్

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 30 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.27 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 62,076

తలనీలాలు సమర్పించినవారు : 23,699

● నేడు పెంపుడు జంతువుల దినోత్సవం



పెంచితే పంచేను ప్రేమ



కాసింత దగ్గరకు తీసుకుంటే కొండంత అభిమానాన్ని చూపిస్తాయి. ప్రేమగా సాకితే ప్రాణమే పెడతాయి. తమ చిన్ని పొట్టను నింపితే జీవితాంతం విశ్వాసం చూపిస్తాయి. అందుకే మనలో చాలామంది జంతువులు, పక్షులను పెంచుతుంటారు. వాటితో అనుబంధాన్ని ఏర్పరుచుకుంటారు. ఆ మూగజీవులతో మమేకమవుతారు. కుటుంబ సభ్యులతో సమానంగా ఆదరిస్తారు. వాటికేమైనా జరిగితే విలవిల్లాడిపోతారు. తిరుపతిలో ఎక్కువ మంది ఇంట్లో కుక్కలను పెంచుతున్నారు. కుందేళ్లు, ఎలుకలు, పిల్లులే కాదు పలు రకాలు పక్షులనూ సాకుతున్నారు. ఒకరైతే గుర్రాన్ని పెంచుతూ ప్రేమను వ్యక్తం చేస్తున్నారు. వారిలో కొందరిని ఒకసారి పలుకరిస్తే

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)



ఆ పది గుర్రాలే నా లోకం

అశ్వాలే నా లోకం. నా దగ్గర మార్వాడీ జాతికి చెందిన పది గుర్రాలున్నాయి. ఏడాది వయసున్నప్పుడు రాజస్థాన్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి పెంచుతున్నాను. ఒకపక్క బిజినెస్ పనులు చేసుకుంటూ గుర్రాలను చూసుకుంటున్నాను. ఒక్కో గుర్రానికి నెలకు రూ20వేలు ఖర్చవుతుంది. భారంగా భావించను. భవిష్యత్తులో గుర్రాలపై పిల్లలకు అవగాహన కల్పించాలనుకుంటున్నాను.



- కార్తీక్, బైరాగిపట్టెడ(తిరుపతి)



పక్షులంటే ప్రాణం

నాకు పక్షులు, కుందేళ్లను పెంచడమంటే ఇష్టం. నా దగ్గర నాలుగు రకాల జాతుల పక్షులు(8 జతలు) ఉన్నాయి. నాలుగు జతల కుందేళ్లున్నాయి. అమాయకంగా అందంగా కనిపించే వీటిని చూస్తే అప్పటివరకు పడిన కష్టాన్ని మర్చిపోతాను. 15 ఏళ్లుగా పెంచుతున్నాను. వీటితో గడపడమంలో చాలా ఆనందాన్ని పొందుతాను. ఒత్తిడి దూరమవుతుంది..

- దుర్గాప్రసాద్, అవిలాల (తిరుపతి)

నాకోసం ఎదురు చూస్తాయి

చిన్నప్పటి నుంచి శనకాలంటే మహా ఇష్టం. ఇంట్లో నాలుగింటిని పెంచుకుంటున్నా. నెల జీతంలో వీటి సంరక్షణకు రూ8వేలు ఖర్చవుతుంది. వాటికి ఇష్టమైన ఆహారం పెట్టి సంతోషడతాను. అనారోగ్యం బారిన పడకుండా ఎప్పటికప్పుడు మందులు వాడుతున్నాను. రోజూ వాటి అవసరాలు చూసుకొని డ్యూటీకి వెళతాను. సాయంత్రం అవి ఎంతో ప్రేమగా నాకోసం ఎదురుచూస్తుంటాయి. దీంతో కష్టాన్ని మరిచిపోతుంటాను.

- శివ, కరకంబాడి(తిరుపతి)

ఆరోగ్యం విషయంలో శ్రద్ధ



తిరుపతిలో 700 మందికి పైగా పెట్ లవర్స్ ఉన్నారు. అన్ని జాతుల కుక్కలను పెంచకుంటున్నారు. పిల్లులు, కుందేళ్లను పెంచడం తక్కువ. పెట్స్‌కు టీకాల విషయంలో శ్రద్ధ అవసరం. ఎప్పుడు వేయాలో షెడ్యూల్ చేసుకోవాలి. వాటికి అనుగుణమైన ఆహారం ఇవ్వాలి. విశ్రాంతి పొందేలా సురక్షిత ప్రదేశంలో ఉంచాలి. అవి ఫ్రెండ్లీగా, కుటుంబసభ్యులుగా మారిపోతాయి.

- డాక్టర్ నాగేంద్ర, వెటర్నరీ అధికారి, ఎంసీటీ







పెట్స్ అవసరాలు తీర్చే షాపులు పెరిగాయి

పెట్స్ హాబీ పెరిగేకొద్దీ నగరంలో వాటి అవసరాలకు అనుగుణంగా షాపులు పెరిగాయి. ముఖ్యంగా ఆహారం, మందుల షాపులు వచ్చాయి. 1991లో తిరుపతిలో వెట్‌పార్మా ప్రారంభించాను. తిరుపతిలో 14 నుంచి 15వేల పెట్స్ ఉన్నాయి. కరోనా సమయంలో వీటి సంఖ్య బాగా పెరిగింది. ఆహారానికి సంబంధించి విదేశీ ఉత్పత్తులు కూడా అందుబాటులో ఉన్నాయి. మందులతో పాటు బెల్టులు లాంటి యాక్సరీస్‌లకు డిమాండు ఉంది.

- ఎం.శ్రీనివాసరావు, వెట్ ఫార్మా ఏజెన్సీస్, తిరుపతి



ప్రత్యేక షాపుల్లో పెట్స్ కోసం ఆటవస్తువులు, స్నాక్స్, తదితరాలు

కలికిరిలో 15న దేశవాళీ విత్తనాల పరిరక్షణ సదస్సు

● హాజరుకానున్న రాయలసీమ రైతులు

కలికిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశవాళీ వంగడాలను పరిరక్షించి, అవసరమైతే బహుళ ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి కేంద్ర వ్యవసాయ శాఖ సన్నాహాలు ప్రారంభించింది. రాయలసీమ జిల్లాల్లో దాదాపు ముప్పై, నలభై ఏళ్ళ క్రితం వాడుకలో ఉన్న వరి, వేరుశెనగ, ఉద్యాన పంటలు, పశుగ్రాసం తదితర సంప్రదాయ వంగడాల విత్తనాలను సమీకరించి పరిరక్షించే బాధ్యతలను కలికిరి కృషి విజ్ఞాన కేంద్రానికి అప్పగించింది. ఇందులో భాగంగా ఈ నెల 15న అన్నమయ్య జిల్లా కలికిరిలో రాయలసీమ స్థాయి దేశవాళీ వంగడాలు సాగుచేస్తున్న రైతుల సదస్సు ఏర్పాటు చేసినట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. రాయలసీమలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, నంద్యాల, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని దేశవాళీ రకాలను కాపాడుకొస్తున్న రైతులు, రైతు సంఘాలతో ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు కోఆర్డినేటర్ వివరించారు. రైతులు తరతరాలుగా కాపాడుకొస్తున్న దేశవాళీ ఆహార ధాన్యాలు, ఉద్యాన పంటలు (పూలతో సహా), పశుగ్రాసానికి సంబంధించిన విత్తనాలను ఈ సదస్సులో ప్రదర్శించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ జిల్లాల్లోని రైతులు తాము ప్రదర్శించబోయే రకాల గురించి ముందుగానే సమాచారం అందజేసి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దేశవాళీ రకాలను సంరక్షిస్తున్న రైతులకు వివిధ రకాల లబ్ధి చేకూరేందుకు ఈ సదస్సు ద్వారా అవకాశం కలుగుతుందని తెలిపారు. పేర్లు నమోదుకు, లేదా ఇతర వివరాల కోసం కేవీకే కోఆర్డినేటర్‌ను 8008500320 లేదా 9618934777 నంబర్లలోనూ లేదా కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన (పశువైద్య విభాగం 9502888728), డాక్టర్ పీరూసాహెబ్ (సస్యరక్షణ 7989850004), డాక్టర్ ఎ.శ్రీనివాసులు (ఉద్యాన విభాగం 8008724284), డాక్టర్ మాధురి (విస్తరణ విభాగం 6303197399), డాక్టర్ ఎస్.సోమశేఖర్‌బాబు (సేద్య విభాగం 9440500167)లను సంప్రదించాలని కోరారు.

నేడు, రేపు తుంబురతీర్థ ముక్కోటి

● ఉదయం 5 నుంచి 10 గంటల వరకే అనుమతి

తిరుమల, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్ర, శనివారాల్లో తుంబుర తీర్థ ముక్కోటి జరుగనుంది. ఈ రెండు రోజులూ తీర్థానికి ఉదయం 5 నుంచి 10 గంటల వరకు భక్తులను అనుమతిస్తారు. భక్తులకు టీటీడీ పాపవినాశనం డ్యాం వద్ద అన్నప్రసాదాలు, తాగునీరు అందజేయనుంది. ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్యులు, మందులను కూడా అందుబాటులో ఉంచనున్నారు. ఎక్కువ దూరం నడవాల్సి ఉండటంతో 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, గుండె, శ్వాసకోస సమస్యలు, స్థూలకాయం ఉన్నవారికి అనుమతిలేదని టీటీడీ స్పష్టం చేసింది. ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సమీక్షించారు. ముక్కోటి రోజుల్లో గోగర్భం డ్యాం సర్కిల్ నుంచి పాపవినాశనం డ్యాం వరకు ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతిస్తారు. ప్రైవేట్ వాహనాలకు అనుమతిలేదని టీటీడీ ప్రకటించింది.

నిఖిత మృతిపై పోలీసుల దర్యాప్తు వేగవంతం

చంద్రగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నరసింగాపురంలో యువతి అనుమానాస్పద మృతిపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. గ్రామానికి చెందిన నిఖిత(17) ఈనెల 4న మృతి చెందడం, ఆగమేఘాలపై కుటుంబ సభ్యులు దహనక్రియలు నిర్వహించడం తెలిసిందే. ఇది పరువు హత్యగా వెలుగులోకి రావడంతో గురువారం మృతురాలి ఎముకలను ఫోరెనిక్స్ బృందం సేకరించింది. ల్యాబ్‌కు పంపింది. ఘటన జరిగిన రోజున మృతురాలి తల్లి సుజాత ఉనికిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కుటుంబ సభ్యులు తనకు విషం పెట్టి చంపేద్దామనికుంటుంటే విన్నానని నిఖిత తన ప్రియుడి అజయ్‌కు వాట్సప్ ద్వారా మెసేజి పంపినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది.

మెగా డీఎస్సీ పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ఏపీబీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి రాజేంద్రకుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన తిరుపతి జిల్లావాసులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. టెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని, మరిన్ని వివరాలకు 9441456039ను సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయికి 'మినీ ఫాస్ట్ కంపోస్టర్'

● తడుకు విద్యార్థుల ప్రతిభ



జేసీ, డీఈవో, జిల్లా సైన్స్ అధికారితో తో తడుకు విద్యార్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం తడుకు (ఆర్ఎస్) జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన 'మినీ ఫాస్ట్ కంపోస్టర్' జాతీయ స్థాయిలో ఎంపికైంది. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మార్గనిర్దేశంలో విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్ కుమార్ ఈ ప్రాజెక్టును తయారు చేశారు. వికసిత భారత్- 2047లో భాగంగా సహజ సమస్యలకు వినూత్న పరిష్కారాలను గుర్తించి, వాటిని అభివృద్ధి చేసేందుకు విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్, మౌళిక విద్యా మంత్రిత్వ శాఖ, ఆలిండియా కౌన్సిల్‌ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ (ఎస్ఐఎం) పోటీలకు శ్రీకారం చుట్టాయి. 2024 జూలై 29న పోటీలు ప్రారంభంకాగా లక్షలకు పైగా ప్రాజెక్టులు కేంద్ర విద్యామంత్రిత్వ శాఖకు అందాయి. వీటిని ఐదు దశల్లో వడపోసి పలు రాష్ట్రాలకు చెందిన 100 ప్రాజెక్టులు ఎంపిక చేశారు. అందులో మన రాష్ట్రం నుంచి రెండు ఉండగా.. అందులో ఒకటి తడుకు విద్యార్థులు రూపొందించిన మినీ ఫాస్ట్ కంపోస్టర్. ఈ ప్రాజెక్టుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ రూ. 90,500 అందించింది. ఈ మొత్తంతో ఈ పరికరాన్ని వ్యాపార పరంగా వినియోగించేలా అభివృద్ధి చేయనున్నారు.

పరికరం.. ఉపయోగాలు

మినీ ఫాస్ట్ కంపోస్టర్ ద్వారా వంటగది వ్యర్థాలు, పండ్లు, కూరగాయల తొక్కలు, కుళ్లిన ఆహారం, కూరగాయలను సేంద్రియ ఎరువు తయారు చేయొచ్చు. ఏరోబిక్ కంపోస్ట్ పద్ధతిలో బ్యాక్టీరియాను వృద్ధి చెందించి వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మారుస్తుంది. వ్యర్థాలను బ్యాక్టీరియా విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఉష్ణోగ్రతను విద్యుత్‌తో పనిలేకుండా సోలార్ ప్యానెల్స్ ద్వారా సమకూరుతుంది. ఈ మినీ ఫాస్ట్ కంపోస్టర్ పరికరాన్ని రూపొందించిన విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్ గురువారం డీఈవో కేవీఎన్ కుమార్, జిల్లా సైన్సు అధికారి భానుప్రసాద్‌తో కలిసి కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌ను కలిశారు. ఆయన విద్యార్థులను, విద్యాశాఖ అధికారులను అభినందించారు.

అమ్మవారికి కానుకగా బంగారు పట్టీలు





తిరుచానూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారికి కడప జిల్లాకు చెందిన డాక్టర్ రామస్వామి ఏలుమలై రెడ్డి దంపతులు రూ.10 లక్షల విలువైన 120 గ్రాముల బంగారు గజ్జెల(పట్టీలు)ను కానుకగా అందజేశారు. గురువారం ఆలయంలో ఏఈవో దేవరాజులుకు వాటిని అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు బాబు స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి పాల్గొన్నారు.

అర్ధరాత్రి మారణాయుధాలతో హల్‌చల్

● ప్రత్యర్థులు తప్పించుకోవంతో ఇంటి నిర్మాణ గోడలను కూల్చివేసిన వైనం ● ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయని పోలీసులు



ఇంటి నిర్మాణ గోడలను కూల్చివేసిన దృశ్యం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం కొరిడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మారణాయుధాలతో పక్కింట్లో ఉంటున్న దంపతులపై దాడికి ప్రయత్నించగా, వారు తప్పించుకుని పారిపోయారు. దీంతో బాధితులు కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటి గోడలను కూల్చివేసిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. స్థానికల సమాచారం మేరకు... కొరిడి దళితవాడకు చెందిన కిలివేటి మణి, కిష్టమ్మ కొత్తగా ఇంటిని నిర్మించుకుంటున్నారు. వారింటి పక్కనే నివాసం ఉంటున్న కిలివేటి రవిచంద్ర బుధవారం రాత్రి 11 గంటల సమయంలో కత్తి, గడ్డపారతో మణి ఇంటికెళ్లి నీ భర్త ఎక్కడంటూ కిష్టమ్మ ప్రశ్నిస్తూ హల్‌చల్ చేశాడు. ఒంటరిగా ఉన్న కిష్టమ్మ భయంతో భర్తకు ఫోన్ చేయడంతో మణి ఇంటి వద్దకు చేరుకోగా రవిచంద్ర దాడికి ప్రయత్నించాడు. దీంతో మణి, ఆయన భార్య కిష్టమ్మ తప్పించుకుని పారిపోయారు. దీంతో వారు కొత్తగా నిర్మిస్తున్న ఇంటి గోడలను రవిచంద్ర కూల్చివేశాడు. రాత్రి సమయం కావడం, చేతిలో కత్తి, గడ్డపార ఉండడంతో ఇరుగుపొరుగువారు భయంతో మిన్నకుండిపోయారు. ఘటన జరిగిన అనంతరం బాధితులు శ్రీహరికోట పోలీసులకు సమాచారం అందించారు. గురువారం పోలీసులు కొరిడి గ్రామానికి వెళ్లి కూల్చివేసిన ఇంటిని పరిశీలించారు. జరిగిన ఘటనపై కిష్టమ్మ శ్రీహరికోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే బాధితులు, నిందితుడు బంధువులు పిలిపించి విచారిస్తామని పోలీసులు చెప్పారు.

రేపు మాజీ ఉపరాష్ట్రపతి తిరుపతి పర్యటన

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు శనివారం నుంచి రెండు రోజులపాటు తిరుపతి పర్యటనకు విచ్చేయనున్నారు. శనివారం ఉదయం 10గంటలకు తిరుపతి నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో జరిగే 'ఒక దేశం- ఒక ఎన్నిక' సెమినార్‌లో ప్రసంగించనున్నారు. సాయంత్రం 5 గంటలకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో హాస్టల్ బిల్డింగ్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం 6 గంటలకు జాతీయ సంస్కృత విద్యాలయంలో జరిగే గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సంస్మరణ సభలో పాల్గొంటారు. ఆదివారం ఉదయం 8.20గంటలకు హైదరాబాద్‌కు తిరుగు పయనం కానున్నారు.

తిరుపతి నుంచి కడప జిల్లాకు వెళ్లే వాహనాల మళ్లింపు

రాయచోటి మీదుగా నడపాలని ఆదేశం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి సీఎం చంద్రబాబు వస్తున్న కారణంగా తిరుపతి నుంచి వెళ్లే అన్ని వాహనాలను దారి మళ్లించారు. భాకరాపేట, పీలేరు, రాయచోటి మీదుగా నడపాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాలు జారీ చేశారు. కడప నుంచి తిరుపతికి పీలేరు, భాకరాపేట మీదుగా రావాల్సి ఉంటుందని తెలిపారు. 11వ తేదీ రాత్రి 9 నుంచి 12వ తేదీ ఉదయం 9 గంటల వరకు ఇది అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

తిరుమలలో డిప్యూటీ స్పీకర్



తిరుమల/రేణిగుంట, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణరాజు గురువారం తిరుమలకు వచ్చారు. గాయత్రి అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ ఓఎస్డీ సత్రేనాయక్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రఘురామ కృష్ణరాజు శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. కాగా, గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. తన కుమారుడి జన్మదినం సందర్భంగా శ్రీవారి దర్శనానికి వచ్చానన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తన కేసులో విచారణ ఎదుర్కొంటున్న డాక్టర్ ప్రభావతమ్మకు జ్ఞాపక శక్తిని ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థిస్తానని వ్యంగంగా అన్నారు.

17న ఆర్థిక కమిషన్ రాక

తిరుపతి(కలెక్టరేట్),ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 16వ ఆర్థిక కమిషన్ ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కమిషన్ పర్యటన ఏర్పాట్లపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఏర్పాట్లు, ప్రోటోకాల్, బందోబస్తు పగడ్బందీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీఆర్వో నరసింహులు, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, సీపీవో ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం: విజయశ్రీ



రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు, వ్యవసాయ అధికారులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం స్థానిక రైతు సేవా సహకార సంఘ ఆవరణలో సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం రాయితీ వ్యవసాయ పనిముట్లు అందజేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని రాయితీపై వ్యవసాయ పనిముట్లను అందిస్తున్నామని చెప్పారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 98 మంది రైతులకు రూ.18 లక్షల విలువచేసే వ్యవసాయ రాయితీ పనిముట్లను అందజేశామన్నారు. త్వరలో డ్రోన్‌లు కూడా అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కొక్కు శంకరయ్య, దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకురాలు అనిత, ఏవోలు కవిత, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

హుస్సేనమ్మ దర్గా గంధోత్సవం ప్రారంభం



హుస్సేనమ్మ దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

దొరవారిసత్రం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం నెలబల్లిలోని హుస్సేనమ్మ దర్గా గంధోత్సవం గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే గంధోత్సవాల్లో మొదటి రోజు మొక్కుబడి కలిగిన భక్తులు దర్గా చుట్టూ ప్రదక్షణలు చేశారు. కొంతమంది భక్తులు దర్గా ప్రాంగణంలో నిద్రించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సీఎం చంద్రబాబు దృష్టికి మత్స్యకార సమస్యలు



ఫిష్‌కాన్ సభ్యుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

తడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, పులికాట్ సరస్సు పూడికతీత గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించామని రాష్ట్ర ఫిష్‌కాన్ ఉపాధ్యక్షుడు శివాజీ తెలిపారు. గురువారం తడలో ఫిష్‌కాన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలను తెలుసుకునేందుకు ఆయా జిల్లాల్లో మత్స్యకార నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమస్యలను నమోదు చేసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫిష్‌కాన్ రాష్ట్ర డైరెక్టర్లు శ్రీనివాసులు, వేణుగోపాల్, దాసు, పులికాట్ మత్స్యకార సంఘం నాయకులు మనోహర్, రఘు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది

డక్కిలి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. మండలంలోని డి.వడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తచెరువు గ్రామంలో 2వ విడత రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం గ్రామంలో ర్యాలీ, గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేతో దీర్ఘకాలిక భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. సమావేశంలో సర్పంచు వేపమాను చెంచమ్మ, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

వాకాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి పనులు వేగవతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కాలువలు, చెరువుల్లో పూడికతీత, పంట కుంటలు, నీటి తొట్టిలు, గోకులం షెడ్ల నిర్మాణం, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో విజయమ్మ, ఈసీ మల్లికార్జున, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జడ్జిని సన్మానించిన కోర్టు సిబ్బంది

గూడూరు అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టులో ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానా బేగం గుంటూరుకు బదిలీ అయ్యారు. గురువారం ఆమెను కోర్టు సిబ్బంది సన్మానించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీభవనంలో గురువారం పేదలకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, జీజీ నాయుడు, దశరథరామిరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, రాంప్రసాద్, రవి కుమార్, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



దేశమ్మ మృతదేహం

బాలాయపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని వేణుగోపాలపురంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... కయ్యూరు పంచాయతీలోని వేణుగోపాలపురం గ్రామానికి చెందిన పోలూరు నాగరాజు భార్య పోలూరు దేశమ్మ(43) గురువారం ఇంటి వద్ద ఇనుప తీగపై బట్టలు ఆరేస్తుండగా విద్యుదాఘాతం జరిగింది. చుట్టుపక్కలవారు గమనించి ఇనుపతీగను తొలగించేటప్పటికే దేశమ్మ మృతి చెందింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

కోన పాలకవర్గం కొలువు దీరేదెన్నడో...?

- వచ్చే నెల 8 నుంచి బ్రహ్మోత్సవాలు
- చైర్మన్‌పై దృష్టి సారించని ప్రభుత్వం
- ఎమ్మెల్యేకి కత్తిమీద సాములా ఎంపిక



పెంచలకోనలోని నృసింహుడి ఆలయం

రాపూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన ఆలయ పాలకవర్గం నియాయకంపై భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రెండేళ్లుగా పాలక మండలి లేకపోవడంతో ఆలయ అభివృద్ధి కుంటుపడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన పాలకవర్గం గడువు 2023 సెప్టెంబరు 10కి ముగిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తవుతున్నా, ఇప్పటికీ పాలకవర్గాన్ని నియమించలేదు. కనీసం ఆలయానికి ఇన్‌చార్జిగా కూడా లేకపోవడంతో అధికారులు, సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు.

8 నుంచి బ్రహ్మోత్సవాలు

మే 8 నుంచి కోనలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలపై ఎమ్మెల్యేకు ఒక్క మాటైనా చెప్పకుండా అధికారులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు విని పిస్తున్నాయి. ఎమ్మెల్యే కురుగొండ్ల కోనలో పర్యటించి ఆలయం అభివృద్ధిపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

కత్తిమీద సాములా చైర్మన్ ఎంపిక

కోన ఆలయ వార్షిక ఆదాయం రూ.12 కోట్లకు పైగానే ఉంది. అంతేకాక రోజురోజుకు అభివృద్ధి చెందుతుండడంతో పాలకమండలి చైర్మన్ పదవిపై అందరి దృష్టి పడింది. టీడీపీలో పలువురు నాయకులు చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో పాలక మండలిలో ఎవరిని నియమించాలనేది ఎమ్మెల్యేకి కత్తి మీద సాములా మారింది.

కళ తప్పిన సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు





గూడలిలోని సంగమేశ్వరాలయం - జనాలు రాకపోవడంతో పిల్లలకు కొడిముద్దలు పెడుతున్న వేదపండితులు

కోట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలో జరుగుతున్న కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వెలవెల పోతున్నాయి. ప్రచార లోపం, ఉభయకర్తల దూరంతో సాదాసీదాగా జరుగుతున్నాయి. ఈనెల 5 నుంచి 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఎంతో ప్రత్యేకత కలిగిన గూడలి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు తమిళనాడు నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తారు. అయితే దేవదాయశాఖ ప్రచారం చేయడంలో నిర్లక్ష్యం చేసింది. ఆలయానికి పాలకమండలిని నియమించకపోవడంతో నిర్వహణ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. అంతేకాకుండా స్వామివారి హంస, శేషవాహన, నంది సేవ కార్యక్రమాలకు ఉభయకర్తలు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తూతూమంత్రంగా స్వామివారిని ఊరేగించి చేతులు దులుపుకుంటున్నారు. లక్షలాది రూపాయల విలువ చేసే 8.75 ఎకరాల ఆలయానికి మాన్యం భూములు ఉన్నాయి. ఏటా లక్షలాది రూపాయలు కౌలు వస్తుంది. అయినా బ్రహ్మోత్సవాలను సాదాసీదాగా నిర్వహిస్తుండడం పట్ల భక్తులు ఆవేదన చెందుతున్నారు.

అవిశ్వాస తీర్మానంతో కూటమికి సంబంధం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నేతలు

వెంకటగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై జరిగిన అవిశ్వాస తీర్మానానికి కూటమి ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని ఏఎంసీ మాజీ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే రామకృష్ణ నివాసంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన కూటమి నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటుందోన్న అక్కసుతోనే ఆ పార్టీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అవిశ్వాసం డ్రామాకు తెరలేపారని ఆరోపించారు. అల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం గురించి చర్చించేందుకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కలెక్టరును కలిశారే తప్ప అవిశ్వాస తీర్మానం వాయిదా వెయ్యాలని కోరలేదని చెప్పారు. పదేపదే అసత్య ప్రచారం చేస్తే అబద్ధం నిజమైపోదన్న విషయం రాంకుమార్ రెడ్డి గ్రహిస్తే మంచిదన్నారు. ఏడాదిగా రాంకుమార్ రెడ్డి నిర్వహిస్తున్న ఏ ఒక్క పార్టీ కార్యక్రమంలోనైనా నక్కా భానుప్రియ పాల్గొన్నారా అని ప్రశ్నించారు. వైసీపీలో వర్గపోరును ఎమ్మెల్యే రామకృష్ణకు అంటగట్టడం సరికాదన్నారు. అనవసరంగా కూమి ప్రభుత్వంపై బురద చల్లడాన్ని మానుకుని అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. సమావేశంలో కూటమి నాయకులు రామదాసు గంగాధరం, జంపాల ప్రకాష్, పునుగోటి విశ్వనాధ నాయుడు, మంకు ఆనంద్, కాపా శ్రీనివాసులు నాయుడు, అవ్వారు సత్యనారాయణ, బీరం రాజేశ్వరరావు, అనిల్ రామారావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందించేందుకు తనవంతు చర్యలు చేపడుతున్నానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. చిట్టమూరు మండలం కొత్తపాళెం గ్రామానికి చెందిన రామ్మూర్తి గుండెజబ్బుతో బాధపడుతుండడంతో అతనికి వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.4.50లక్షల చెక్కును గురువారం అందజేశారు. కార్యక్రమంలో దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహావీర్ జయంతి



మహావీర్ గ్రామోత్సవంలో జైనులు

గూడూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జైన్ సంఘం ఆధ్వర్యంలో గురువారం మహావీర్ జయంతి నిర్వహించారు. స్థానిక త్యాగరాజవీధిలోని జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహావీర్‌ను ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ పట్టణంలో గ్రామోత్సం జరిపారు. ప్రతిఒక్కరూ హింసా మార్గాన్ని వదిలి శాంతి మార్గంలో నడుస్తూ, సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రశాంత జీవనం సాగించాలన్నారు. అనంతరం రాజా వీధిలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధర్మీచంద్, జ్ఞానచంద్, రమేష్, మనీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై శ్రీరామచంద్రుడు



గూడూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటి మిట్టలోని కోదండ రామాంజనేయ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి విశ్వక్సేనా ప్రార్థన, సుదర్శన హోమం, తిరిచ్చి ఉత్సవం జరిపారు. రాత్రి స్వామివారిని సింహవాహనంపై అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. సుమంత్‌కుమార్, సంధ్యారాణి కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

పెళ్లకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో మాజీ సీఎం జగన్‌పై అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మండుతున్న ఎండలు

పెళ్లకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే భానుడు భగ్గుమనడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గురువారం పెళ్లకూరు మండలంలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం మబ్బులు కమ్ముకుని కాస్త చల్లదనంగా ఉన్నప్పటికీ ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. అవసమైతే తప్ప బయటకు వెళ్లద్దని చెంబేడు వైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. తప్పని సరిగా ఎండలో పనిచేయాల్సి వస్తే తలకు కాటన్ వస్త్రం ధరించాని, ఎక్కువగా నీటిని తీసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురైతే గ్లూకోజ్, ఎలక్ట్రోల్ ఓఆర్‌ఎస్‌ను నీటిలో కలిపి తరచూ తాగాలన్నారు.

బీటెక్ విద్యార్థికి యూటీఎఫ్ సాయం



దినేష్ కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

తడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గుండె, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న బీటెక్ విద్యార్థికి యూటీఎఫ్ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. కొండూరు గ్రామానికి చెందిన మీంజూరు దినేష్ అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల అనారోగ్యం భారిన పడడంతో కుటుంబ సభ్యులు చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స చేయించారు. దినేష్ గుండె, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడని, చికిత్సకు సుమారు రూ.60లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న యూటీఎఫ్ నాయకులు ఆ విద్యార్థికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. మండలానికి చెందిన 71మంది యూటీఎఫ్ సభ్యులు సుమారు రూ.55 వేలు సమీకరించారు. ఆ నగదును గురువారం బాధితుడి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సునీల, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, మండల నాయకులు వెంకటేశ్వర్లు, రవికుమార్, సుధాకర్, రామ్మూర్తి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

వాకాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి అన్నారు. మండలంలోని వెంకటరెడ్డిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భధారణ సమయంలో కనీసం నాలుగుసార్లు వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. తల్లి మానసిక ఆరోగ్యం బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలోసూపర్‌వైజర్ బుజ్జమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్యామసుందరపురంలో పోషణ్ పక్వాడ

కోట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని శ్యామసుందరపురం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమం జరిగింది. సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ కృష్ణమ్మ ఆధ్వర్యంలో పోషక విలువలతో కూడిన ఆహారంపై తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా పోషక, విటమిన్లు కలిగిన ఆహారాన్ని ప్రయోగత్మకంగా చేసి చూపించారు.

సోమసముద్రంలో...

చిట్టమూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోమసముద్రం అంగనవాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమ గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ బిడ్డ పెరుగుదల, పర్యవేక్షణ గురించి వివరించారు.

రైల్లో నుంచి జారిపడి యువకుడి మృతి



మృతిచెందిన యువకుడు

తడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైలులో నుంచి జారిపడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన కొండూరు గ్రామ సమీపంలో గురువారం జరిగింది. సూళ్లూరుపేట నుంచి చెన్నై వెళుతున్న మెమూ రైలు నుంచి సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి జారి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. నలుపురంగు నిక్కరు, నీలం రంగు చొక్కా ధరించి వున్నాడని, అంతకు మించి వివరాలు దొరకలేదని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ చెప్పారు.

టెంపో ఢీకొని కూలీ మృతి

తడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): టెంపో ఢీకొని కూలీ మృతి చెందాడు. చెన్నై రెడ్‌హిల్స్‌కు చెందిన సుబ్రమణి(50) రైల్వే కూలీగా పనిచేస్తున్నాడు. నెల రోజుల నుంచి కొంతమంది కూలీలతో కలిసి కాచింగాడు కుప్పం వద్ద ఇంటిని అద్దెకు తీసుకుని వుంటున్నాడు. బుధవారం రాత్రి వంట సరుకులు తెచ్చుకునేందుకు బీవీపాళెం చెక్‌పోస్టు వద్దకు వెళ్లాడు. తిరిగి వెళ్లే క్రమంలో జాతీయ రహదారిని దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న టెంపో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సుబ్రమణిని స్థానికులు ఎళావూరు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లుగా వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

ముగ్గురికి గాయాలు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధినిలోని దాచెరువు హరిజనవాడలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సుబ్బరావు కథనం మేరకు... గురువారం దాచెరువు గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణ విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంలో గ్రామానికి చెందిన సీహెచ్ రఘురామయ్య, శివప్రసాద్, రత్నయ్య తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసుకున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్‌ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్‌ను నిలుపుదల చేసి, భద్రతా సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులను వెంటనే అమలు చేయాలని, మహిళా ఉద్యోగినులకు పిల్లల సంరక్షణ సెలవులను మంజూరు చేయాలని కోరారు. అలాగే ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలన్నారు. ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అహ్మద్, ప్రవీణ్, కృష్ణ, గౌస్, రమేష్, సుధాకర్, శేఖర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన బీజేపీ నేత వాకాటి



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వాకాటి దంపతులు

తడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి దంపతులు సీఎం చంద్రబాబును గురువారం కలిశారు. వాకాటి కుమార్తె వివాహానికి ఆహ్వానం పలికేందుకు అమరావతి సచివాలయానికి వెళ్లిన వాకాటి అక్కడ సీఎం చంద్రబాబును కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన సైబర్ సెక్యూరిటీ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి

కోట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగురోజుల పాటు జరిగిన సైబర్ సెక్యూరిటీ ఫండమెంటల్స్ అండ్ ప్రాక్టికల్ అప్లికేషన్ వర్క్‌షాపు బుధవారం ముగిసింది. సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉన్న అవకాశాల గురించి అధ్యాపకులు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి, విభాగాధిపతులు రాజశేఖర్‌రెడ్డి, నారాయణరావు, సురేష్‌బాబు పాల్గొన్నారు.